## నేటి కందం-నేటికి అందం

మన తెలంగాణము నందున
వనితల కుపయోగ పడెడి వస్తూత్పత్తిన్
ఘనముగ సీతారాంపుర
మున మొదలిడినారు ప్రజలు మోదము బొందన్ !!

(మన తెలంగాణా రాష్ట్రం లో హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్ లో నూటాయాభై కోట్ల రూపాయలతో మహిళల ఆరోగ్యానికి సంబంధించిన వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీని నెలకొల్పారు. దీని వలన చాలా మందికి ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

నిత్యం పార్లమెంటు
నిరసనల జోరు
పట్టువిడుపు లేకుంటే
పరిష్కృతి చేజారు.
ప్రతిపక్షం ప్రశ్నలన్నీ
ప్రభుత్వం దాటవేత
ఐతేకాదా ప్రజాస్వామ్య
హక్కులన్నీ అణచివేత



-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 7-8-2026  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.  సంపుటి :33 సంచిక: 4 పేజీలు:6 వెల: రూ.1/-


## ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ హైవేపై రోడ్డు ప్రమాదం.. తల్లి, కొడుకు మృతి



ఖమ్మం, ఆగష్టు 6: ఖమ్మం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై దంసలాపురం సమీపంలోని మున్నేరు వంతెన వద్ద గురువారం ఉదయం చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో తల్లి, కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.

మృతులు చింతకాని మండలం గాంధీనగర్ గ్రామానికి పాపబత్తిని సుజాత (38), పాపబత్తిని పవన్ కుమార్ (17) వారుగా గుర్తించారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన పాపబత్తిని నరసింహారావు అనే వ్యక్తి తన భార్య, కొడుకుతో కలిసి హైదరాబాద్‌కు కారులో బయల్దేరారు. మున్నేరు వంతెన పై నుండి ప్రయాణం చేస్తున్న సమయంలో హైదరాబాద్ వైపు నుండి వస్తున్న డీసీఎంను అదుపుతప్పి బలంగా ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో సుజాత, పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నరసింహారావును ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి విచారణ చేపట్టారు.

## అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తా: కవిత

హైదరాబాద్, ఆగస్టు 6: సామాజిక న్యాయ తెలంగాణను తీర్చాదిద్దాడానికి ముందున్నామని టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఈరోజు(గురువారం) సరూర్‌నగర్‌లో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు సామాజిక న్యాయం కోసం పాటుపడలేదని విమర్శించారు. ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది పలుకుతుందని, అనేక మంది జీవితాల్లో మార్పు తీసుకురానుందని వెల్లడించారు.

సామాజిక న్యాయం అనగానే అందరూ భయపడుతున్నారని.. అయితే ఇది ధర్మపోరాటమని కవిత అన్నారు. రాష్ట్రంలో బీసీలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరస్పరం ప్రేమ లేఖలు రాసుకుంటారని.. బీసీ బిల్లుకు ఆమోదం తీసుకురావడంలో ఈ దోస్తీ ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు బీసీ బిల్లుకు ఆమోదం రాకపోతే సంక్రాంతి తర్వాత ఢిల్లీకి వెళ్లి ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు.తెలంగాణలో ఇప్పటికీ కుల వివక్ష కొనసాగుతోందని కవిత అన్నారు. తాను అగ్రవర్ణ కుటుంబంలో పుట్టినా, అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన వారంతా కూడా బుద్ధుడి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, అలాగే ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కవిత డిమాండ్ చేశారు.

## గొప్ప పరిపాలన దక్షుడు జయశంకర్ సార్ : కేయూ రిజిస్ట్రార్




హన్మకొండ, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి) ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గొప్ప పరిపాలన దక్షుడు, తెలంగాణ సాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆడిటోరియం ప్రాంగణంలోని బీసీ సెల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాంచంద్రం మాట్లాడుతూ జయశంకర్ ప్రతి ప్రసంగం వాస్తవాలు, గణాంకాలతో కూడినదని, నిబద్ధతకు ఆయన నిలువెత్తు నిదర్శనమన్నారు.

ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి, కంట్రోలర్ కట్ల రాజేందర్, పి.కరుణాకర్, ఎం.లింగయ్య, పుల్లా శ్రీనివాస్, సంగాల మల్లేశ్వర్, ఆర్.కృష్ణయ్య, తిరునహరి శేషు, ఈసం నారాయణ, పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి, రమ, చిర్రా రాజు, బి.సురేష్‌లాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ కూలి వృద్ధురాలు మృతి


హన్మకొండ, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి) హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేల్ గ్రామంలో ప్రహరీ గోడ కూలి గుడికందుల యాకలక్ష్మి (55) అనే వృద్ధురాలు.. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతిచెందగా ఇంట్లో పనిచేయడానికి వెళ్లిన ఆ వృద్ధురాలు ఇంటి పక్కన వారి ప్రహరీ గోడ కూలి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. యాకలక్ష్మి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో భూకంపం.. రిక్టర్ స్కేలుపై 5.1 తీవ్రత నమోదు

న్యూఢిల్లీ, ఆగష్టు 6:అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున భూమి కంపించింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1 గా నమోదైంది. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ (ఎన్‌సీఎస్) ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ భూకంపంవల్ల ఎలాంటి ప్రాణనష్టంగానీ, ఆస్తి నష్టంగానీ జరగలేదు.

నేషనల్ సెంటర ఫర్ సిస్మాలజీ అధికారుల వివరాల ప్రకారం.. ఉదయం 5.45 గంటలకు అప్పర్ సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు సుమారు 116 కిలోమీటర్ల దూరంలో, భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ప్రధాన భూకంపానికి ముందు అదే ప్రాంతంలో వరుసగా మూడు స్వల్ప ప్రకంపనలు నమోదైనట్లు వెల్లడించింది.

## కారు ప్రమాదంలో అతిక్ అహ్మద్ కుమారుడు అబాన్ మృతి.. మరో ముగ్గురికి గాయాలు



న్యూఢిల్లీ, ఆగష్టు 6: గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ కుమారుడు అబాన్ (21) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతడితోపాటు కారులో ప్రయాణిస్తున్న ఇంకో స్నేహితుడు కూడా మరణించగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ పరిధిలో గురువారం జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లో పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్. రాజకీయ నాయకుడిగానూ గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడిపై అనేక కేసులు నమోదయ్యాయి. తన అనుచరులతో హత్యలు, బెదిరింపులు వంటి ఘటనలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో 2023లో అతిక్ శత్రువులు అతడిని అతి సమీపం నుంచి కాల్చి చంపారు.

అతిక్ చిన్న కొడుకైన అబాన్ అహ్మద్.. స్నేహితులతో కలిసి ప్రయాగ్ రాజ్ నుంచి ఝాన్సీకి వైట్ హ్యుండాయ్ క్రెటా కారులో బయల్దేరాడు. జైలులో ఉన్న తన సోదరుడిని కలుసుకునేందుకు గురువారం వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. ఒక జంతువు అడ్డురావడంతో దానిని తప్పించేందుకు కారు డ్రైవర్ ప్రయత్నించాడు. అయితే, కారు అతివేగంతో ఉండటంతో అదుపుతప్పి, పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతిక్ అహ్మద్‌తోపాటు, అతడి స్నేహితుడు సోను కూడా మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు, పోలీసులు కారులో గాయపడ్డ ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే అబాన్, అతడి స్నేహితుడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఇద్దరి మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డవారికి చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనలో వాహనం చాలా వరకు ధ్వంసమైందని పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అతీక్‌తోపాటు, అతడి కుటుంబానికి కూడా తీవ్రమైన నేర చరిత్ర ఉంది. 2023లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతిక్ కొడుకు అసద్ అహ్మద్ మరణించాడు. అతడి రెండో కొడుకు అలీ అహ్మద్ ఝాన్సీ జైలులో ఉన్నాడు. అతడిపై 10 వరకు క్రిమినల్ కేసులున్నాయి. అతడిని కలిసేందుకు అబాన్ వెళ్తుండగానే ఈ రోడ్డు ప్రమాదం జరిగింది.

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో గోపాలపురం పాఠశాలకు నూతన సొబగులు

ఖమ్మం, ఆగష్టు 6:ఖమ్మం జిల్లాలోని గోపాలపురం పాఠశాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలబడ్డారు. ఆ పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఖమ్మం కలెక్టర్ దివాకర్ పాఠశాలను సందర్శించారు.

ఉపాధ్యాయిని ఇందిరతో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడారు. శిథిల భవనాల స్థానంలో కొత్త తరగతి గదులు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయినిని అధికారులు అభినందించారు. సీఎం ఆదేశాలతో వెంటనే నిధుల విడుదల చేశారు. ఈ నిధులతో గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పథంలో కొనసాగనుంది.



## తెలంగాణకే జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్గొండ, ఆగష్టు 6: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం నల్గొండలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ప్రజాగాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి చివరి శ్వాస వరకు తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని వివరించిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించి ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించారని తెలిపారు.

శ్రీకాంత్ చారి వంటి అమరుల బలిదానాలు, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి నాయకుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని, మరో 7 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలు, ఏటీసీలు, న్యాక్ సెంటర్ల ద్వారా మరింత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పురోగతిలో ఉన్నాయని, ఆగస్టు 2028 నాటికి పూర్తి చేసి దేవరకొండ నుంచి బ్రాహ్మణవెల్లంల వరకు సాగునీరు అందించి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు నీరందించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

ఎస్ఎల్‌బీసీతో పాటు పాలమూరు?రంగారెడ్డి సహా పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తయి తెలంగాణ సస్యశ్యామలం అయినప్పుడే ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు సాకారమవుతాయని మంత్రి అన్నారు.

గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని మాట్లాడుతూ, తన పాటల ద్వారా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గ్రామగ్రామాన చాటిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమిర్ అలీ, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఏడో తరగతి బాలిక మిస్సింగ్

జగిత్యాల, ఆగస్టు 6: జిల్లాలో బాలిక అదృశ్యం కలకలం రేపుతోంది. కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో 7వ తరగతి విద్యార్థిని నిన్న(బుధవారం) సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. బాలిక మిస్సింగ్‌పై తల్లిదండ్రులకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సమాచారం అందించారు. బాలిక.. స్కూల్‌లోనే డ్రెస్ మార్చుకుని వెళ్లినట్లు సీసీటీవీ కెమెరాల్లో గుర్తించారు. బుక్స్, బ్యాగ్, బూట్లు స్కూల్‌లోనే వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బ్యాగ్‌లో సూసైడ్ నోట్ లభించినట్లు సమాచారం. 'తల్లిదండ్రులతో ఇబ్బందిగా ఉంది.. చాలా మంది ఇబ్బంది పెడుతున్నారు' అంటూ నోట్‌లో రాసినట్లు తెలుస్తోంది.

'ఇక్కడ ఉండలేను, చనిపోవడానికి వెళ్తున్నాను' అంటూ బాలిక సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## సుల్తానాబాద్ ఆల్ఫోర్స్‌లో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు

కరీంనగర్,6(నేటినిజం ప్రతినిధి) సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగకు తెలంగాణలో ప్రత్యేక స్థానం ఉందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో గురువారం బోనాల పండుగను విద్యార్థులచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవంగా భావించే బోనాల పండుగను ఆషాడమాసంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి కుటుంబం సుఖ సంతోషాలు, ఆరోగ్యంతో పాటు ఐశ్వర్యం కలగాలని ప్రార్థిస్తారని తెలిపారు. గతంలో హైదరాబాదుకు పరిమితం అయిన బోనాల పండుగకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు రావడంతో ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు.

మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో, అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ




ఊరేగింపుగా ఆలయాలకు తీసుకెళ్తారని, పోతరాజు నృత్యాలు, డప్పు వాయిద్యాలు, జానపద నృత్యాలు, బోనాల ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయనీ అన్నారు. రాష్ట్ర ప్రజలందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్తుందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల విద్యార్థులకు తెలిపేందుకే పాఠశాలలో ప్రతిఏటా బోనాలను నిర్వహించి విద్యార్థులను చైతన్య చైతన్య పరుస్తున్నామన్నారు. పోతరాజు, అమ్మవారి వేషధారణలో విద్యార్థిని విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# చేనేత కళలకు సాంకేతిక రంగులు అద్దలేమా !

## (07 ఆగష్టు "జాతీయ చేనేత దినోత్సవం" సందర్భంగా)

మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉన్నది. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరి. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయి. పంచె కట్టులో పురుషులు, చీర కట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, ఆకర్షణీయంగా, సాంప్రదాయం ఉట్టిపడే విధంగా కనుపిస్తారు. నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ సింగిడి రంగులు వస్త్రాలకు అందాల విందులు ఆరబోస్తాయి. నేతన్న సృజన, దారం పోగును నాట్యం చేయించగల హస్తకళా నైపుణ్యం సదా అభినందనీయం. నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి సంకేతంగా గాంధీ గారు నూలు వడికే రాట్నం ముందు కూర్చొని ప్రచారం చేయడం చూసాం. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించనంతగా అభివృద్ధి చెందడం చూస్తున్నాం. సిరిసిల్ల నేతన్న వస్త్రాలు, మంగళగిరి చీరలు, బెనారస్ వస్త్ర వెలుగులు, ధర్మవరం ధగధగలు, కోట చీరల కమనీయాలు కలంకారీ కళాకాంతుల వస్త్ర రంగులు నేటికీ మనల్ని మంత్రముగ్దుల్ని చేస్తూనే ఉన్నాయి.

### 12వ జాతీయ చేనేత దినోత్సవం-2026:

అనాదిగా గ్రామీణ ప్రజానీకానికి జీవనోపాధిని కల్పిస్తున్నది. ఒక దారపు పోగు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నది. దేశ సామాజిక-ఆర్థిక సుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇస్తున్నది. స్వతంత్ర భారతంలో చేనేత హస్తకళల ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, నేతన్నల సమస్యలకు పరిష్కారాలను వెతకడం, మన చేనేతకు అంతర్జాతీయ గుర్తింపుకు ప్రయత్నాలు చేయడం లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని 2015 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం చొరవతో ప్రతి ఏట 07 ఆగష్టున "జాతీయ చేనేత దినోత్సవం (నేషనల్ హాండ్లూమ్ డే)" పాటించడం జరుగుతున్నది. 07 ఆగష్టు 1905న బెంగాల్ విభజనలను చేసిన బ్రిటీష్ నిర్ణయానికి వ్యతిరేకంగా కలకత్తాలో మొదలైన "స్వదేశీ ఉద్యమం" ప్రారంభానికి గుర్తుగా ఈ దినోత్సవం 07 ఆగష్టున నిర్వహించుకోవడం ముదావహం. నేడు మన చేనేత హస్తకళల పరిశ్రమతో పాటు దాని అనుబంధ రంగాల్లో దాదాపు 70 శాతం మంది మహిళలు శ్రమ చేయడం జరుగుతున్నది. భారత చేనేత పరిశ్రమపై 32 లక్షల కుటుంబాలు ఆధారపడడంతో పాటు 4.33 మిలియన్ల ఉద్యోగ ఉపాధులు కల్పించడం కొనసాగుతున్నది. నేతన్నల ఆదాయాన్ని మెరుగు పరచడంతో పాటు వారిని శక్తివంతులుగా మార్చడానికి వేదికగా ఈ దినోత్సవం ఉపయోగపడుతున్నది.

### చేనేత పరిశ్రమలో 70 శాతం మహిళలు:

దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన 125 చేనేత సంస్థలు, 1,246 చేనేత క్లస్టర్లు నేటి జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుతుంటున్నాయి. ఆంధ్రలో 98, తెలంగాణలో 34 క్లస్టర్లు ఉన్నాయి. ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల్లో 6.9 శాతం భారతదేశమా ఉత్పత్తి చేస్తున్నది.

చైనా మాత్రం 52 శాతానికి పైగా సదవస్త్ర మార్కెట్‌ను కైవసం చేసుకున్నది. చేనేత వస్త్రాల ఉత్పత్తుల్లో 95 శాతం భారతదేశమా అందిస్తున్నది.

మన దేశ ఆచారాలు, వారసత్వాలను బట్టి నేతన్న చూపిస్తున్న హస్తకళా నైపుణ్యాల ప్రదర్శన వల్ల చేనేత వస్త్రాలకు ఆదరణ పెరుగుతోంది.

నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించాలంటే ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలి.

నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం ఉండేది.

డిజిటల్ కాలంతో పాటు ఈ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమ డిజైన్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా కనిపించేవి.



-మధుపాళీ
9949700037

# భారత్-ఉజ్బెకిస్తాన్ మధ్య శతాబ్దాల నాటి చారిత్రక, సాంస్కృతిక, నాగరికత సంబంధాలు: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, ఆగష్టు 6:భారత్, ఉజ్బెకిస్థాన్ దేశాలు శతాబ్దాల నాటి చారిత్రక, సాంస్కృతిక, నాగరికత సంబంధాలతో ముడి పడి ఉన్నాయని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా పేర్కొన్నారు. ఈ సుదీర్ఘ అనుబంధమే ఇరు దేశాల చిరకాల మైత్రికి కీలకం గా నిలుస్తోందని అన్నారు. పార్లమెంట్ హౌస్‌లో ఉజ్బెకిస్థాన్ విదేశాంగ మంత్రి బఖ్తియోర్ సైదోవ్‌తో స్పీకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భం గా శ్రీ బిర్లా మాట్లడుతూ.. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రాజకీయ విశ్వాసం, విస్తరిస్తున్న వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల మధ్య పెరుగుతున్న సంబంధాలు రాబోయే రోజుల్లో ఈ ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. భారత్-ఉజ్బెకిస్థాన్ సంబంధాలపై ఇరు దేశాల నాయకులు విస్తృత చర్చలు జరిపారు. ముఖ్యంగా పార్లమెంటరీ సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సంస్కృతితో పాటు ప్రాంతీయ, ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన పలు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. భారతీయ ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి శ్రీ ఓం బిర్లా మాట్లాడుతూ.. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్, ప్రజల ఆకాంక్ష లను, వైవిధ్యాన్ని ప్రతిబింబించే అద్భుతమైన పార్లమెంటరీ వ్యవస్థను కలిగి ఉందని తెలిపారు. 543 మంది సభ్యులున్న లోక్‌సభ దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరులకు ప్రాతినిధ్యం వహిస్తోందని చెప్పారు. భారత్ లోని బహుళ పక్ష రాజ్యాంగ వ్యవస్థ విభిన్న ఆలోచనలకు, నిర్మాణాత్మక చర్చలకు సమాన అవకాశాలు కల్పిస్తుందని వివరించారు. భారత పార్లమెంట్ పనితీరును వివరిస్తూ... మన పార్లమెంటు ఏడాదికి మూడు సమావేశాలను నిర్వహిస్తుందని స్పీకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో జాతీయ ప్రాధాన్యత కలిగిన పలు ముఖ్యాంశాలపై చురుగ్గా చర్చలు సాగుతున్నాయని ఉజ్బెకిస్థాన్ విదేశాంగ మంత్రికి తెలియజేశారు. మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ ఆవిష్కరణలు, సాంకేతికత, అనుసంధానం, పెట్టుబడులు, వాణిజ్య రంగాల్లో భారత్ సాధించిన గణనీయమైన పురోగతిని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ప్రస్తావించారు. భారతీయ యువత ప్రపంచ వ్యాప్తంగా నాయకత్వ బాధ్యతలు చేపట్టడం పెరుగుతోందని ఆయన అన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ సంస్థలతో భారత్ భాగస్వామ్యం నిరంతరం విస్తరిస్తోందని అన్నారు. 2026 మార్చిలో ఏర్పాటు చేసిన భారత్-ఉజ్బెకిస్థాన్ పార్లమెంటరీ స్నేహ బృందం ఇరు దేశాల చట్టసభల మధ్య సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని... ఆర్థిక, విద్యా, సాంస్కృతిక, ప్రజా సంబంధాల రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 2025 ఏప్రిల్‌లో తాష్కెంట్‌లో జరిగిన 150వ అంతర్- పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) అసెంబ్లీలో తాను పాల్గొన్న విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ పర్యటనలో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు శ్రీ షవ్‌కత్ మిర్జియోయేవ్, సెనేట్ ఛైర్‌పర్సన్ తంజిలా నార్బయేవా, శాసనసభ స్పీకర్ నురిద్దీన్ ఇస్మాయిలోవ్‌లతో జరిగిన ఉన్నత స్థాయి భేటీలను ప్రస్తావించారు. ఆ పర్యటనలే ఇరుదేశాల పార్లమెంటరీ సహకారానికి గొప్ప పునాది వేశాయని చెప్పారు. భారత్-ఉజ్బెకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా అభివృద్ధి చెందుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, విదేశాంగ మంత్రి ప్రస్తుత పర్యటన ఇరు దేశాల సమగ్ర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని స్పీకర్ ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్‌తో ఉన్న బహుముఖ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉజ్బెకిస్థాన్ కట్టుబడి ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి శరీ బఖ్తియోర్ సైదోవ్ పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, పార్లమెంటరీ సహకారాన్ని విస్తరించడానికి తాష్కెంట్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత్ పటిష్టమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలను ఆయన ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ చట్టసభల అనుభవం నుంచి ఉజ్బెకిస్థాన్ ఎంతో లబ్ధి పొందుతుందని అన్నారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక బంధం విస్తరించడానికి మెరుగైన పార్లమెంటరీ భాగస్వామ్యం ఎంతో తోడ్పడుతుందని శ్రీ సైదోవ్ చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఉమ్మడి ప్రాజెక్టులు, వర్ధమాన రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడానికి భాగస్వామ్య దృక్పథం అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

ఈ భేటీ సందర్భంగా ఉజ్బెకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చిన 150వ అంతర్-పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) అసెంబ్లీ వివరాలతో కూడిన ప్రత్యేక స్మారక ప్రచురణను లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లాకు శ్రీ బఖ్తియోర్ సైదోవ్ అందజేశారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి పంచాయతీ కార్యదర్శుల ఘన నివాళి

## గ్రామాభివృద్ధిలో ఆయన సేవలు చిరస్మరణీయమన్న కార్యదర్శులు



నల్గొండ, ఆగష్టు 6:నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల నల్లబెల్లి మండల పంచాయతీ కార్యదర్శులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నర్సంపేట ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్ రెడ్డి గ్రామాభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు.

గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేస్తూ హరితహారం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంతో పాటు డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పారిశుద్ధ్య వసతులు, పల్లె ప్రకృతి వనాల అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. గ్రామాల రూపురేఖలు మార్చేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని అన్నారు. ఆయన మరణం నర్సంపేట నియోజకవర్గానికే కాకుండా గ్రామీణాభివృద్ధి రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

చివరగా దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మాతా శిశు ఆరోగ్యంతోనే ఆరోగ్య భారతం - లయన్ వడుకాపురం జగదీశ్వరా చారి



హైదరాబాద్, ఆగష్టు 6:నేటి మాతా శిశు ఆరోగ్య సురక్షతోనే రేపటి ఆరోగ్యకరమైన భారతి నిర్మించబడుతుందని సీనియర్ లయన్ వడుకాపురం జగదీశ్వరా చారి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు అమృతాహారమైన తల్లిపాలు మాత్రమే పట్టించాలని అన్నారు. నవజాత శిశువుల ఆరోగ్యంతో పాటు తల్లి ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో ప్రసవం అయిన వందకు పైగా తల్లులకు వార్డుల్లో తిరిగి పోషకాహారం రూపం లో పండ్లు, ఉడకబెట్టిన గుడ్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ ఎం డాక్టర్ రాజు, సీనియర్ లయన్స్ బుర్ర మధుసూ దన్ రెడ్డి, లయన్ ఇనుగుర్తి రమేష్, అధ్యక్షులు లయన్ ఎం మహేందర్, కార్యదర్శి ఎన్ వేణుగో పాల్, ఉపాధ్యక్షులు లయన్ డాక్టర్ శ్రీనివాస్, లయన్ ఎం సత్యానారాయణ రావు, లయన్ ఎం వేణు, లయన్ కె సత్యం, లయన్ పి సురేందర్‌తో పాటు ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న నర్సులు పాల్గొన్నారు.

# కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్‌తో రైతుల భేటీ.. ఇథనాల్‌కు మద్దతు తెలిపిన కర్షకులు



న్యూ ఢిల్లీ, ఆగష్టు 6:అఖిల భారత కిసాన్ సమన్వయ సంఘం (ఏఐకేసీసీ) ప్రతినిధి వర్గం నిన్న... అంటే 2026 ఆగస్టు 4న, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. ఇథనాల్ వ్యవసాయ రంగానికి ఒక గొప్ప అవకాశమని, అయితే ఇథనాల్‌కు సంబంధించిన విధానాన్ని రూపొందించేటప్పుడు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని, పంటకు సరి అయిన ధర రైతులకు అందేటట్లు చూడాలని వారు స్పష్టం చేశారు. రైతు నేతల సూచనలన్నింటినీ కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ శ్రద్ధగా విన్నారు. ఇథనాల్ విషయంలో రైతుల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం తప్పక పరిగణనలోకి తీసుకుంటుందని రైతు నేతలకు మంత్రి హామీని ఇచ్చారు. రైతులను తాను దైవంతో సమానంగా చూస్తానని, కృషి భవన్‌లో రైతులకు అన్ని వేళలా సాదర స్వాగతం లభిస్తుందని శ్రీ శివరాజ్ సింగ్ అన్నారు.

ఏఐకేసీసీ ప్రతినిధి వర్గం కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌తో న్యూఢిల్లీ లోని కృషి భవన్‌లో సమావేశమైంది. ప్రతినిధి వర్గంలో పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన రైతు నాయకులు ఉన్నారు. సమావేశంలో ప్రధానంగా ఇథనాల్, రైతుల ఆదాయం, కనీస గిట్టుబాటు ధర (ఎమ్ఎస్‌పీ), మార్కెట్లతో పాటు, జాతీయ వ్యవసాయ విధానంపై చర్చించారు. రైతులు తాము ఇథనాల్ పట్ల సానుకూలంగా ఉన్నామని స్పష్టం చేశారు. అయితే ఈ కార్యక్రమ సిసలు ప్రయోజనం కంపెనీలకు, మధ్యవర్తులకు మాత్రమే కాకుండా రైతులకు అందాలనే తాము కోరుతున్నామని వారు అన్నారు.

సమావేశంలో రైతులు ఇథనాల్‌పై తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. ఇథనాల్ వల్ల పంట ఉత్పాదన ఒక్క బజారుకే పరిమితం కాబోదని, అది పెట్రోల్ పంపులకు, ఇంధన మార్కెట్టు వరకూ చేరుకొంటుందని వారు అన్నారు. దీంతో రైతులకు కొత్త, బలమైన మార్కెట్టు లభిస్తుందని వారు అన్నారు. చెరుకు, మొక్కజొన్న, వరి, ఇతర ముడి సరుకులతో ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తే రైతులకు మరింత ఎక్కువ మంది కొనుగోలుదారులు లభిస్తారని, ఫలసాయం చెడిపోవడం, నిల్వ సమస్యలు ఎదురవడం అనే సమస్యలు తగ్గుతాయన్నారు.

ఇథనాల్‌కు తాము వ్యతిరేకం కాదని, దానిని పూర్తిగా సమరిస్తున్నామని రైతులు తెలిపారు. అయితే, ఏ పంటకైనా.. అది చెరుకు కావచ్చు, లేదా మొక్కజొన్న కావచ్చు.. సరైన ధరలు రైతులకు లభించడం అవసరమని వారు అన్నారు. ఇథనాల్‌కు సంబంధించిన విధానం సాగుకు ఒక కొత్త మార్గాన్ని చూపాలని, అది తమకు ఒక కొత్త చిక్కు సమస్యగా మారకూడదనే తాము కోరుతున్నామని రైతు ప్రతినిధులు అన్నారు. తాము ఇథనాల్‌కు మద్దతు తెలుపుతున్నామని, అయితే ఇథనాల్ కూడా తమకు అండగా నిలవాలని వారు అన్నారు.

ఇథనాల్ పేరిట సామాజిక మాధ్యమాలతో పాటు కొన్ని వేదికలలో గందరగోళాన్ని వ్యాప్తి చేస్తున్నారని అనేక మంది రైతు నేతలు సమావేశంలో ప్రస్తావించారు. ఇథనాల్ వాడితే వాహనాలకు చేటు అని, ఇథనాల్ రైతు ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందని చెబుతున్నారన్నారు. ఇథనాల్ వల్ల ఏయే పంటలకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి, సేద్యపు నీటిని ఎక్కువగా వినియోగించాల్సిన పంటల నుంచి దుర్భిక్ష పరిస్థితిని తట్టుకొనే పంటల వైపు ఎలా మళ్లాలనే అంశాలపై కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంస్థలూ కలిసికట్టుగా సుస్పష్టంగా అర్థం అయ్యేటట్లు వివరాలను అందించాలని రైతులు డిమాండ్ చేశారు. యువతరానికి అవగాహన కలిగేలా రీల్స్, చిన్న వీడియోలు, క్షేత్ర స్థాయి సభలను నిర్వహించడం ద్వారా ఇథనాల్‌కు సంబంధించిన వాస్తవ అంశాల్ని ప్రచారం చేయడం అవసరమని వారు అన్నారు.

రైతులు చెప్పినదంతా కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ శ్రద్ధగా విన్నారు. మధ్య మధ్యలో ఆయన కొన్ని ప్రశ్నలు అడుగుతూ, క్షేత్ర స్థితిని తెలుసుకోవడానికి ప్రయత్నించారు. కేంద్ర ప్రభుత్వ ఆలోచనా విధానం స్పష్టంగా ఉందని, ఇథనాల్ కార్యక్రమం లబ్ధి పూర్తి వ్యవస్థకు అందాలని ఆయన చెప్పారు. వ్యవసాయ క్షేత్రం మొదలు ఇంధన ట్యాంకు వరకూ ప్రతిదశలో ప్రయోజనం చేకూరాలని, అయితే భీమభాగం లబ్ధి రైతులకు అందాలని ఆయన స్పష్టం చేశారు. ఇథనాల్ రైతుల జేబులను నింపడంతో పాటు దేశానికి ఇంధన భద్రతను కూడా పటిష్ఠపరుస్తుందని శ్రీ శివరాజ్ సింగ్ అన్నారు. 'ఏ పంటకు, ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా చూడటమే మా ప్రాధాన్యం' అని ఆయన అన్నారు.

మొక్కజొన్న, బియ్యం, చెరుకు, ఇతర ముడిసరుకుల ధరలకీ, డిమాండుకీ మధ్య సమతౌల్యాన్ని కాపాడటానికి విధాన సమీక్ష చేపడతామని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ సమావేశంలో హామీని ఇచ్చారు. రైతులకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, మరీముఖ్యంగా మొక్కజొన్న రైతుల లబ్ధిని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ఇథనాల్ విషయంలో అందుబాటులో ఉన్న శాస్త్రీయ అధ్యయనాలు, సాంకేతిక నివేదికల సాయంతో వ్యతిరేక ప్రచారానికి బదులిస్తారనీ, రైతులతో కలిసి వాస్తవాల ఆధారంగా చర్చను చేపడతారని ఆయన వివరించారు.

ఇథనాల్ విషయంలో గందరగోళాన్ని యదార్థాలు, క్షేత్ర స్థాయి అనుభవం దన్నుతో పటాపంచలు చేస్తారనే సందేశాన్ని, అలాగే ప్రభుత్వంతో కలిసి పనిచేసి రైతులకు ప్రయోజనకరమైన విధానాన్ని రూపొందించే ప్రక్రియను బలోపేతం చేస్తారన్న సందేశాన్ని గ్రామ గ్రామానికీ తీసుకుపోతామని ఏఐకేసీసీ ప్రతినిధులు సమావేశం చివర్లో అన్నారు. రైతు సంస్థలు ప్రభుత్వానికి ప్రత్యర్థులు కావని, విధాన రూపకల్పనలో భాగస్వాములని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఒక సుస్పష్ట సందేశాన్ని ఇచ్చారు. "ఇథనాల్ అంశంపై రైతులు చెప్పింది మేం సావధానంగా విన్నాం. ఇప్పుడిక ఈ సూచనలు, సలహాల ఆధారంగా ఎలాంటి ప్రాథమిక ప్రణాళికను రూపొందించాలన్నదే వేం చేయాల్సిన పని.. ఆ ప్రణాళికతో రైతులు, దేశం, ఇంధనం.. ఈ మూడూ బలపడాలి'' అని ఆయన అన్నారు.

# జైనూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

## తెలంగాణ సాధనలో జయశంకర్ సేవలు చిరస్మరణీయం



ఆదిలాబాద్, ఆగష్టు 6: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ ఆడ బీర్షావ్ ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ జీవితాంతం కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమోహన్, ఉద్యోగులు భరత్, విట్టల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్య టీకాల అభివృద్ధిలో ఆత్మనిర్భర్ భారత్ ముందడుగు

న్యూఢిల్లీ, ఆగష్టు 6:ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ వైరస్ (ఏఎస్ఎఫ్వీ) ద్వారా వచ్చే ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ (ఏఎస్ ఎఫ్) ప్రపంచవ్యాప్తంగా పెంపుడు అడవి పందులకు సోకే అత్యంత వినాశకరమైన సీమాంతర పశు వ్యాధులలో ఒకటి. తీవ్రమైన జ్వరం, రక్తస్రావం, దాదాపు 100 శాతానికి చేరువయ్యే మరణాల రేటు దీని ప్రధాన లక్షణాలు. ఈ వ్యాధి ప్రపంచ పందుల పెంపకం రంగానికి తీవ్రమైన సామాజిక ఆర్థిక నష్టాలను కలిగించింది. ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ ను 2020లో భారత్ లో మొదటిసారిగా గుర్తించినప్పటి నుంచీ పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వ్యాపించింది. దీనిఫలితంగా పందులు పెద్ద ఎత్తున మరణించడం, పందుల ఉత్పత్తికి విఘాతం కలగడం, వాటి రవాణా, వ్యాపారంపై ఆంక్షలు కూడా విధించారు. ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలోని చిన్నతరహా పందుల పెంపకం దారుల జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లింది. భారతదేశంలో దీనికి సమర్థవంతమైన చికిత్స లేదా వాణిజ్యపరంగా ఆమోదించిన టీకా అందుబాటులో లేకపోవడంతో ఇప్పటివరకు వ్యాధి నియంత్రణ కేవలం త్వరిత వ్యాధి నిర్ధారణ, వ్యాధి సోకిన జంతువులను తొలగించడం, కఠినమైన జీవభద్రతా చర్యలపైనే ఆధారపడింది.

భారత్ లో ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ వ్యాప్తి చాలా తీవ్రమైన ఆర్థిక ప్రభావాన్ని చూపింది. 2020 లోనూ, 2021లోనూ అస్సాంలో పందుల మరణాల వల్ల సుమారు రూ. 276 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా. మిజోరంలో, 2025 నాటికి వ్యాధి వ్యాప్తి 11,382 పైగా కుటుంబాలపై ప్రభావం చూపగా, దీనివల్ల దాదాపు రూ. 982 కోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ వ్యాధి వ్యాప్తి సంఘటనలు దేశంలో వ్యాధి నివారణ సన్నద్ధతను బలోపేతం చేయడానికీ, రైతుల జీవనోపాధిని కాపాడటానికీ, పందుల పెంపకం రంగాన్ని మరింత స్థిరంగా మార్చడానికీ ఒక సమర్థవంతమైన స్వదేశీ పరిష్కారం ఎంత అత్యవసరమో స్పష్టంగా చూపించాయి.

ఈ కీలక సవాలుకు పరిష్కారంగా భోపాల్‌లోని భారత వ్యవసాయ పరిశోధన మండలి - జాతీయ అత్యంత భద్రతా జంతు వ్యాధుల సంస్థ (ఐసీఏఆర్-ఎన్ఐహెచ్ఎస్ఏడీ) శాస్త్రవేత్తలు పందుల కోసం భారత్‌లోనే తొలి స్వదేశీ ఎంఏ-104 సెల్ లైన్ ఆధారిత లైవ్ అటెన్యుయేటెడ్ ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ (ఏఎస్ఎఫ్) టీకాను అభివృద్ధి చేశారు. ఎంఏ-104 సెల్ లైన్‌లో ప్రత్యేక జన్యు తొలగింపులతో రూపొందించిన ఏఎస్ఎఫ్వీ జెనోటైప్ - ఎఐ వైరస్‌ను ఉపయోగించి ఈ టీకాను అభివృద్ధి చేశారు. పశు వైద్య పరిశోధన రంగంలో ఇది ఒక కీలక ముందడుగుగా నిలవడంతో పాటు, భారీ స్థాయిలో ఉత్పత్తికి కూడా అత్యంత అనుకూలంగా ఉంటుంది.

ఈ టీకా ప్రయోగశాల స్థాయిలో సమగ్ర పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. ఇందులో సూక్ష్మజీవ రహిత (స్టెరిలిటీ), స్వచ్ఛత, భద్రత, జన్యు స్థిరత్వం, రోగనిరోధక శక్తిని ప్రేరేపించే సామర్థ్యం, రక్షణాత్మక ప్రభావం, వైరస్ మళ్లీ తీవ్రతను సంతరించుకునే అవకాశంపై అధ్యయనాలు నిర్వహించారు. భారత ప్రభుత్వ మత్స్య, పశు సంవర్ధక పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పశు సంవర్ధక, పాడి పరిశ్రమల విభాగం (డీఏహెచ్‌డీ) సహకారంతో ఈ టీకాను క్షేత్రస్థాయిలో కూడా పరీక్షించి ధ్రువీకరించారు. దీంతో వాస్తవ పరిస్థితుల్లోనూ ఈ టీకా సురక్షితమైనదని, సమర్థవంతంగా పనిచేస్తుందని మరింత బలంగా నిర్ధారణ అయింది. ఈ టీకాను ఆరోగ్యంగా... ఎనిమిది వారాల వయస్సు పైబడిన పందులకు సిఫారసు చేశారు. ఇది 1 మి.లీ. మోతాదులో ఇంజెక్షన్ గా ఇస్తారు. ప్రాథమిక టీకా ఇచ్చిన 14 రోజుల తర్వాత బూస్టర్ డోసు ఇస్తారు.

ఈ టీకా దేశవ్యాప్తంగా పందుల మరణాలను గణనీయంగా తగ్గించి, ఆర్థిక నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుందని, పందుల పెంపకం దారుల జీవనోపాధిని మెరుగుపరుస్తుందని అంచనా. ప్రపంచంలోనే అత్యంత విధ్వంసకరమైన పశు వ్యాధులలో ఒకటైన దీనికి వ్యతిరేకంగా సమర్థవంతమైన నివారణ సాధనాన్ని అందించడం ద్వారా, ఇది భారత్ లో జంతు ఆరోగ్య భద్రతను బలోపేతం చేసి, పందుల పెంపకం రంగం సుస్థిరమైన అభివృద్ధికి తోడ్పడుతుంది.

డేర్ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్ మాట్లాడుతూ, "ఈ అద్భుతమైన ఆవిష్కరణ పశువైద్య శాస్త్రంలో ఒక నూతన శకానికి నాంది. ప్రపంచ స్థాయి జంతు ఆరోగ్య పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో పెరుగుతున్న భారత్ శాస్త్రీయ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. పశుగణాల ఆరోగ్యాన్ని బలోపేతం చేయడానికి, వ్యాధి సన్నద్ధతను పెంచి దేశ ఆహార, జీవభద్రతకు మద్దతు ఇచ్చే నూతన తరం స్వదేశీ వ్యాక్సిన్లు, వినూత్న సాంకేతికతల అభివృద్ధికి ఇది బాటలు వేస్తుంది" అని పేర్కొన్నారు.

ప్రస్తుతానికి వియత్నాంలో మాత్రమే కొన్ని వాణిజ్యపరంగా అనుమతి పొందిన ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ టీకాలను పేటెంట్ పొందిన ప్రత్యేక సెల్ లైన్లను ఉపయోగించి తయారు చేస్తున్నారు. దీనికి భిన్నంగా, ఐసిఎఆర్-ఎన్ఐహెచ్ఎస్ఎడి అభివృద్ధి చేసిన స్వదేశీ టీకా విస్తృతంగా అందుబాటులో ఉన్న ఎంఏ-104 సెల్ లైన్‌ను ఉపయోగిస్తుంది. ఇది సాంకేతిక రంగంలో సాధించిన అతిపెద్ద విజయం. ఇది ప్రత్యేకమైన/ పేటెంట్ పొందిన తయారీ విధానాలపై ఆధారపడటాన్ని నివారిస్తుంది. భారీ స్థాయిలో టీకాల తయారీని సాధ్యం చేస్తుంది. ఉత్పత్తి ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుంది.

# పీఎంఎఫ్‌బీవై కింద వర్తించే నష్టభయాలు, విపత్తులు

న్యూఢిల్లీ, ఆగష్టు 6:ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) 2016-17 నుంచి దేశంలో ప్రారంభమైంది. రాష్ట్రాలు, రైతులు దీనిని స్వచ్ఛందంగా ఎంచుకోవచ్చు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన పంటలు, ప్రాంతాలకు విత్తనాలు వేసే ముందు దశ నుంచి పంట కోత అనంతర దశ వరకు నిరోధించలేని సహజ విపత్తుల వల్ల జరిగే పంట నష్టానికి ఈ పథకం సమగ్ర బీమా రక్షణను అందిస్తుంది. అడవి జంతువుల వల్ల జరిగే పంట నష్టాలు నిరోధించే అవకాశం ఉండటంతో మొదట్లో వీటిని ఈ పథకంలో చేర్చలేదు. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వాల సొంత ఖర్చుతో 'యాడ్-ఆన్ కవర్' రూపంలో వ్యక్తిగత అంచనా ఆధారంగా అడవి జంతువుల వల్ల జరిగే నష్టాలను కూడా తెలియజేయటానికి రాష్ట్రాలకు అనుమతి ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు, నియమాలను ఈ పథకానికి సంబంధించిన నిర్వహణ మార్గదర్శకాలలో పొందుపరిచారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద నోటిఫై చేసిన అన్ని పంటలకు వరదలు, నీటిలో మునక వల్ల కలిగే నష్టానికి బీమా రక్షణ అందుబాటులో ఉంటుంది. అయితే వరి, జనుము, మేస్తా, చెరకు వంటి నీటిని ఎక్కువగా తట్టుకునే లేదా నీటిలో పెరిగే పంటలకు స్థానిక ప్రాంతాల అంచనా, పరిమిత ప్రాంతాల క్లెయిమ్‌ల మినహా సాధారణ బీమా రక్షణ వర్తిస్తుంది.

ఈ సమాచారాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్ ఈ రోజు లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం రూపంలో వెల్లడించారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామాలే ఆరోగ్యకర సమాజానికి పునాది



కరీంనగర్, ఆగష్టు 6: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామాల ఏర్పాటులో భాగంగా పైలట్ ప్రాజెక్టును ప్రారంభించి ప్రతి ఇంటికి జనపనార (జ్యూట్) సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల సారాన్ని దెబ్బతీయడంతో పాటు నీటి వనరులను కలుషితం చేస్తున్నాయని, పశువుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయని, ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల వెలువడే విష వాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. మార్కెట్‌కు వెళ్లే ప్రతి ఒక్కరూ జ్యూట్ సంచులను వినియోగించి ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులకు పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి జిల్లాలోని ఇతర గ్రామాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం, ఆర్య క్షత్రియ సంఘం సభ్యులు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను విరాళంగా అందజేయగా, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, గ్రామ సర్పంచ్ నర్సింలు, ఉపసర్పంచ్ నరసారెడ్డి, ఎంపీడీవో భరత్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలు ఆదర్శప్రాయం



కరీంనగర్, ఆగష్టు 6:తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు తెలంగాణ ప్రజలకు చిరస్మరణీయ ఆదర్శమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి, ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమని, తన జీవితాన్నే తెలంగాణ కోసం అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలను ఏకం చేసిన జయశంకర్ ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గట్ల రమేష్, ముస్తఫా, సతీష్‌తో పాటు కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్న ఎయిరిండియా విమానం ఏఐ2379



న్యూఢిల్లీ, ఆగష్టు 6:థాయ్ లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానం ఏఐ2379 (ఎయిర్ బస్ ఏ320, నమోదు సంఖ్య వీటీ-ఏఎక్స్ఓ) మార్గమధ్యంలో ఆల్టిట్యూడ్ పరంగా కొద్ది సమయంపాటు హెచ్చుతగ్గులు చోటు చేసుకున్నాయి. అయితే, సమస్యను సత్వరమే పరిష్కరించడంతో...సాధారణ స్థితికి వచ్చింది. అనంతరం ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి విమానం సురక్షితంగా చేరుకుంది.

ఈ విమానంలో ముగ్గురు శిశువులతో సహా మొత్తం 137 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బంది (ఇద్దరు పైలట్లు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది) ఉన్నారు.

విమానం ఎయిర్ పోర్టుకు చేరుకున్న వెంటనే ముందస్తు జాగ్రత్తగా ప్రయాణికులూ, సిబ్బందికీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సమగ్ర వైద్య పరీక్షలు, చికిత్స కోసం ఎనిమిది మంది ప్రయాణికులతో పాటు నలుగురు క్యాబిన్ సిబ్బందిని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చేరిన ప్రయాణికులు, సిబ్బంది పరిస్థితి నిలకడగా ఉండగా.. వారికి వైద్యులు మెరుగైన వైద్య సంరక్షణ అందిస్తున్నారు. విమానంలోని ఇతర ప్రయాణికులకు అవసరమైన సాయం, మద్దతును అందించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి స్వయంగా ఫోర్టిస్ ఆసుపత్రికి వెళ్లారు. ఆయనతో పాటు పౌర విమానయాన శాఖ కార్యదర్శి, డీజీసీఏ డైరెక్టర్ జనరల్ కూడా ఆసుపత్రికి వెళ్లారు. గాయపడిన ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. విమానయాన మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారులు కూడా ఫోర్టిస్, వేదాంత ఆసుపత్రులను సందర్శించి, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సంరక్షణ, సహాయం అందేలా ఆసుపత్రి యాజమాన్యాలతో, విమానయాన ప్రతినిధులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు.

సమస్య తలెత్తిన విమానాన్ని హ్యాంగర్‌కు తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను లోతుగా విశ్లేషించడం కోసం విమానంలోని ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్), కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌ను (సీవీఆర్) అధికారులు భద్రపరిచారు.

ఈ ఘటనపై డీజీసీఏ సమగ్ర విచారణను ప్రారంభించింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యత అని, దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీజీసీఏ అధికారులు స్పష్టం చేశారు.

# అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీలు)

న్యూఢిల్లీ, ఆగష్టు 6:రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రతియేటా వ్యవసాయ వ్యయాలు-ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా, ప్రభుత్వం దేశవ్యాప్తంగా 22 నిర్దిష్ట వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పీలు) నిర్ణయిస్తుంది.

కనీస మద్దతు ధరలను ఉత్పత్తి వ్యయానికి కనీసం ఒకటిన్నర రెట్ల స్థాయిలో ఉంచాలనే ముందస్తు సూత్రాన్ని 2018-19 సంవత్సర కేంద్ర బడ్జెట్ ప్రకటించింది. దీనికి అనుగుణంగా, ప్రభుత్వం 2018-19 సంవత్సరం నుంచి అఖిల భారత సగటు ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం మార్జిన్‌తో... నిర్దేశిత ఖరీఫ్, రబీ, ఇతర వాణిజ్య పంటలన్నింటి కోసం ఎంఎస్‌పీలను పెంచింది.మొత్తం ఉత్పత్తిలో... ఈ ఉత్పత్తుల మార్కెట్ ధర కనీస మద్దతు ధర కంటే తక్కువకు పడిపోయినప్పుడు, మార్కెట్ చేయదగిన మిగులు మాత్రమే ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా సేకరణకు అందుబాటులో ఉంటుంది. రైతులకు ధరల మద్దతును అందించడానికి ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇతర నిర్దేశిత రాష్ట్ర ఏజెన్సీల ద్వారా ధాన్యాలు, ముతక ధాన్యాలను సేకరిస్తుంది. పప్పుధాన్యాలు, నూనె గింజలు, కొబ్బరి సేకరణ... ఈ ఉత్పత్తుల మార్కెట్ ధర ఎంఎస్‌పీ కంటే తక్కువకు పడిపోయినప్పుడు, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం, ప్రధాన పథకమైన ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్ (పీఎం-ఆశా) పథకం కింద అనుబంధ పథకమైన ధరల మద్దతు పథకానికి అనుగుణంగా జరుగుతుంది. పీఎం-ఆశా పథకం కింద నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్), నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్)లు సేకరణ ఏజెన్సీలుగా ఉంటాయి. పత్తి, జనపనారనూ ప్రభుత్వం వరుసగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ద్వారా కనీస మద్దతు ధరకు సేకరిస్తుంది.

దీనికి అదనంగా... ఉత్పత్తి, మార్కెట్ చేయదగిన మిగులు, రైతుల సౌలభ్యం, నిల్వ, రవాణా వంటి ఇతర సరుకు రవాణా, మౌలిక సదుపాయాల లభ్యతను పరిగణనలోకి తీసుకుంటూ ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా తగినన్ని సేకరణ కేంద్రాలను తెరుస్తారు. ఇప్పటికే ఉన్న మండీలు, డిపోలు, గోదాములకు అదనంగా, కీలక ప్రదేశాల్లో తాత్కాలిక కొనుగోలు కేంద్రాలనూ ఏర్పాటు చేస్తారు. సేకరణ ప్రక్రియ నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా, ఎంఎస్‌పీ ఆధారిత సేకరణ ప్రక్రియలు ఎంతగానో మెరుగయ్యాయి. ఎంఎస్‌పీని నేరుగా రైతు బ్యాంకు ఖాతాకు చెల్లించడం... ఆధార్, భూమి రికార్డులను రాష్ట్రాల సేకరణ పోర్టల్‌లతో అనుసంధానించడం ద్వారా ఎంఎస్‌పీ ఆధారిత కొనుగోలు ప్రయోజనాలను రైతులు నేరుగా పొందుతున్నారు.

పప్పుధాన్యాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, వాటిలో స్వయం సమృద్ధి సాధించడం లక్ష్యంగా ప్రభుత్వం 2030-31 వరకు 'పప్పుధాన్యాల్లో స్వయం-సమృద్ధి మిషన్'ను ప్రారంభించింది. పప్పుధాన్యాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థన మేరకు... పీఎం-ఆశా పథకం కింద ముందుగా నమోదు చేసుకున్న రైతుల నుంచి కంది, మినుములు, మసూర్ పప్పులను కేంద్ర నోడల్ ఏజెన్సీలైన నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్), నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్) ద్వారా ప్రభుత్వం సేకరిస్తోంది.ప్రధానమంత్రి-ఆశా పథకం కింద ప్రభుత్వం మార్కెట్ ఇంట ర్వెన్షన్ పథకాన్నీ (ఎమ్ఐఎస్) అమలు చేస్తోంది. ఇది త్వరగా పాడైపోయే, ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) పరిధిలోకి రాని వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తుల సేకరణ కోసం ఉద్దేశించినది. పంట దిగుబడి అధికంగా ఉన్న సమయంలో ఆర్థిక స్థాయిలు, ఉత్పత్తి వ్యయాల కంటే ధరలు తక్కువ స్థాయికి పడిపోయినప్పుడు రైతులు వీటిని నష్టానికి అమ్ముకోకుండా రక్షించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీని కోసం గత సంవత్సరంతో పోలిస్తే, ప్రస్తుత మార్కెట్ ధరల్లో కనీసం 10 శాతం తగ్గుదల ఉండాలి.

# వాణిజ్య బొగ్గు గనుల వేలం ప్రక్రియ 15వ విడత, 13వ విడత రెండో ప్రయత్నాల్లో ఆరు బొగ్గు బ్లాకులకు విజయవంతంగా వేలం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 6:వాణిజ్య బొగ్గు గనుల వేలంలో భాగంగా నిర్వహించిన 15వ విడత, 13వ విడత రెండో ప్రయత్నం కింద కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆరు బొగ్గు బ్లాకులను విజయవంతంగా వేలం వేసింది. ఈ వాణిజ్య బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియను 2026 ఏప్రిల్ 17న మంత్రిత్వశాఖ ప్రారంభించింది. అనంతరం 2026 ఆగస్టు 3 నుంచి 4 వరకు నిర్వహించిన ఆరోహణ వేలం (ఫార్వర్డ్ ఆక్షన్)లో ఈ ఆరు బొగ్గు బ్లాకులకూ వేలం ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఈ ఆరు బ్లాకుల్లో నాలుగు పూర్తిగా పరిశోధించినవి కాగా, రెండు పాక్షికంగా పరిశోధించినవి. ఈ బ్లాకులన్నింటిలో కలిపి దాదాపు 1,503.93 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా.. వీటి గరిష్ఠ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 11.62 మిలియన్ టన్నులు.

2020లో వాణిజ్య బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 147 బొగ్గు బ్లాకులను విజయవంతంగా వేలం వేశారు. వీటి వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 377.974 మిలియన్ టన్నులు. ఈ గనులు అందుబాటులోకి వస్తే దేశీయ బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరగడమే కాకుండా.. బొగ్గు రంగంలో ఆత్మనిర్భరత సాధించాలన్న దేశ లక్ష్యానికి మరింత ఊతం లభిస్తుంది. ఈ బొగ్గు బ్లాకులన్నింటి ద్వారా ఏటా రూ. 48,215 కోట్ల మేర రాబడి వస్తుందనీ, అలాగే రూ. 54,315 కోట్ల మేర మూలధన పెట్టుబడులు సమకూరుతాయనీ అంచనా. అంతేకాకుండా బొగ్గు నిల్వలున్న ప్రాంతాల్లో ఇవి దాదాపు 4,89,552 ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి.

దేశ ఆర్థిక వృద్ధికి బొగ్గు రంగాన్ని ప్రధాన చోదక శక్తిగా నిలిపేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కట్టుబడి ఉందన్న విషయాన్ని ఈ విజయాలు పునరుద్ఘాటిస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీరుస్తూ- అదే సమయంలో ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా.. మరింత బలమైన, పటిష్టమైన, నిజమైన ఆత్మనిర్భర భారత్ సంకల్పాన్ని నెరవేర్చుకునే దిశగా మంత్రిత్వశాఖ పురోగమిస్తోంది.

## అంతంపేటలో భూ రీ-సర్వేను పరిశీలించిన ఆర్డీవో

నల్గొండ, ఆగష్టు 6: నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలంలోని అంతంపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను చండూరు ఆర్డీవో శ్రీదేవి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భూ రికార్డులు మరింత పారదర్శకంగా, ఆధునికంగా మారుతాయని తెలిపారు.రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అవసరమైన రికార్డులను సర్వే అధికారులకు అందజేసి రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ రాములు, ఆర్ఐ చిరంజీవి, సర్వేయర్ జైహింద్, జీపీఓ అధికారులు రామస్వామి, అవంతి తదితరులు పాల్గొన్నారు.




# తక్కువ ఖర్చు, ఎక్కువ సామర్థ్యం, నిరంతర ప్రాతిపదికన విస్తృత స్థాయి గని తవ్వకం కార్యకలాపాలతో భారత్ వృద్ధికి దన్నుగా నిలుస్తున్న దిప్కా ఓపెన్ కాస్ట్

న్యూఢిల్లీ, ఆగష్టు 6:సౌత్ ఈస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ (ఎస్ఈసీఎల్)కు చెందిన దిప్కా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ) భారత బొగ్గు గని తవ్వకాల రంగంలో చోటుచేసుకున్న చెప్పుకోదగిన మార్పులకు ఒక ఉజ్వల ఉదాహరణగా నిలుస్తోంది. దిప్కా ఓసీపీలో 1992లో బొగ్గు ఉత్పదన కేవలం 10 లక్షల టన్నులతో మొదలుపెట్టగా, ప్రస్తుతం ఇది దేశంలో బొగ్గును ఉత్పత్తి చేస్తున్న అతి పెద్ద కాంప్లెక్సులలో ఒకటిగా ఎదిగింది. దిప్కా ఓపీసీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 375 లక్షల టన్నుల అత్యధిక ఉత్పత్తితో పాటు, 394 లక్షల టన్నుల బొగ్గు సరఫరాను కూడా నమోదు చేసింది. 400 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక ఉత్పత్తి (ఎమ్‌టీపీఏ) పరిమాణానికి అవసరమైన పర్యావరణ సంబంధిత ఆమోదం లభించడమే కాకుండా, రాబోయే కాలంలో 60 ఎమ్‌టీపీఏ లక్ష్యం దిశగా దూసుకుపోవడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో దిప్కా ఓసీపీ ప్రస్తుతం వ్యూహాత్మక జాతీయ ఆస్తిగా నిలిచింది. ఈ బహిరంగ గనిలో తవ్వకం కార్యకలాపాలను తక్కువ ఖర్చుతో, ఎక్కువ సామర్థ్యంతో, నిరంతర ప్రాతిపదికన విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారు.

దిప్కా ఓసీ గత సంవత్సరం రికార్డు స్థాయి ప్రదర్శనను కొనసాగిస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని కూడా అంతే ప్రభావవంతంగా మొదలుపెట్టింది.

ఈ గని 2026 జులై 25 నాటికి 126.6 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ఇది ఉత్పత్తి కి సంబంధించి క్రమ క్రమంగా వృద్ధిని సాధించాలనుకున్న లక్ష్యానికి మించి, 104 శాతానికి సమానం. గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూసినపుడు ఇక్కడ బొగ్గు ఉత్పత్తిలో 30.5 శాతం వార్షిక వృద్ధి నమోదవడం మరో ప్రోత్సాహకరమైన అంశం. ఇది గనిలో ఉత్పాదకతలో మెరుగుదలనే కాకుండా, పరికరాలను ఉపయోగించడంలో కూడా చెప్పుకోదగిన మెరుగుదలను సూచిస్తోంది. ఇక్కడి నుంచి బొగ్గు సరఫరా ఇంతే పటిష్ఠంగా ఉంది. ఇది 138.7 లక్షల టన్నులకు చేరింది. దీంతో, ఉత్పత్తి కి సంబంధించి క్రమ క్రమంగా వృద్ధిని సాధించాలని పెట్టుకున్న లక్ష్యానికి మించి 109 శాతం పురోగతిని సాధించినట్లయింది. ఫలితంగా థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు, పారిశ్రామిక వినియోగదారులకు నిరంతరాయ ఇంధన సరఫరా విషయంలో పూచీ పడుతున్నట్లు కూడా అయింది.

బొగ్గు ఉత్పత్తికి, సరఫరాకు మధ్య ఆటంకాలు ఏవీ లేని ఎదురవని విధంగా సమన్వయాన్ని ఏర్పరుచుకోవడం కార్యకలాపాల నిర్వహణలో దిప్కా చాటుకుంటున్న పరిణతికి నిదర్శనం. ఇక్కడ గని తవ్వకం పనులు, రవాణా, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ వేర్వేరు కార్యకలాపాలుగా కన్నా ఏకీకృత విలువ ఆధారిత వ్యవస్థలో అంతర్భాగాలుగా ఉంటున్నాయి.

గని తవ్వకం పనితీరు ఎలా ఉందో ఉత్పత్తి స్థాయే ప్రధానంగా తెలియజేస్తుంది. అయితే, దిప్కా సాధించిన విజయం ఆర్థికంగా ఈ గని ఎంత వరకూ తోడ్పడుతోందనే అంశాన్ని కూడా ఇంతే ప్రాధాన్యంతో చాటిచెబుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ గని మొత్తం మీద రూ.3,230.91 కోట్ల లాభాన్ని సంపాదించి, ఎస్ఈసీఎల్‌కు లాభాలు తెచ్చిపెడుతున్న అత్యంత బలమైన కేంద్రాల్లో ఒకటిగా మారింది. లాభదాయకత మెరుగుపడటానికి ఒక్క అధికోత్పత్తే కారణం కాదు. ఖర్చులను మెరుగ్గా నియంత్రించడం, కార్యకలాపాల నిర్వహణలో దక్షతను పెంపొందించడం కూడా తమ వంతు తోడ్పాటును అందించాయి. ప్రతి టన్నుకు లాభం రూ.827కు పెరిగింది. దీంతో పాటు నిర్వహణ సంబంధిత ఖర్చులు అదే నిష్పత్తిలో పెరగకుండానే పెద్ద ఎత్తున ఉత్పత్తిని సాధించవచ్చని ఈ గని నిరూపించింది. ఈ ఆర్థిక ప్రమాణాలు కోల్ ఇండియా సమగ్ర లాభదాయకతలో దిప్కా పాత్ర అంతకంతకు పెరుగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

దిప్కా ప్రభావవంతమైన ఉత్పత్తి సామర్థ్యంలో అనేక వ్యూహాత్మక కార్యక్రమాలు పోషించిన పాత్రా కీలకమే. ఇవి గని దీర్ఘకాలిక ఉత్పత్తి సామర్థ్యాన్ని బలోపేతం చేశాయి. వీటిలో భూ సేకరణ, పునరావాసం.. ఇవి దీర్ఘకాలిక సామర్థ్య విస్తరణకు సంబంధించి అన్నింటి కన్నా ముందుగా ప్రస్తావించాల్సిన అంశాలు.

మాల్‌గావ్ గ్రామాన్ని విజయవంతంగా అధీనంలోకి తీసుకున్న తరువాత, ఈ ప్రాంతం హర్‌దీ బజార్ పునరావాసం, పునరాశ్రయ కల్పన దిశగా గొప్ప పురోగతిని సాధించింది. ఇది ఈ ప్రాంతంలో చేపట్టిన అతి పెద్ద, అత్యంత సంక్లిష్ట పునరావాస, పునరాశ్రయ కల్పన (ఆర్ అండ్ ఆర్) కార్యక్రమాల్లో ఒకటి. పునరావాసాన్ని దిప్కా ఓ చట్టపరమైన బాధ్యతగా మాత్రమే భావించకుండా, అభివృద్ధి ప్రధాన దృష్టికోణంలో చూస్తూ పునరావాస టౌన్‌షిప్‌ను చక్కని ప్రణాళికతో తీర్చిదిద్దింది. టౌన్‌షిప్‌లో రహదారులు, పాఠశాలలు, ఆరోగ్యసంరక్షణ కేంద్రాలు, సామాజిక సదుపాయాలు, ప్రజోపయోగ సదుపాయాలు వంటి పౌరులకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారు. ఈ భాగస్వామ్య ప్రధాన విధానం, పారదర్శక వైఖరి గనికి కావలసిన భూమి లభ్యతకు మార్గాన్ని సుగమం చేయడంతో పాటు ఆసక్తిదారులలో విశ్వాసాన్నీ, ఈ ప్రాజెక్టుకు సామాజిక ఆమోదాన్ని బలపరిచాయి.

గని తవ్వకం కార్యకలాపాలను భారీ స్థాయిలో చేపట్టాలంటే తరలింపు సంబంధిత మౌలిక సదుపాయాలను కూడా అంతే విస్తృత స్థాయిలో కల్పించవలసి ఉంటుంది. దిప్కాలో కోల్ ఇండియా అత్యంత వైవిధ్యంతో కూడిన బొగ్గు తరలింపు వ్యవస్థలను ఏర్పాటు చేసింది. వాటిలో ఎంజీఆర్‌తో ముడిపడిన సైలోస్, ఫస్ట్ మైల్ కనెక్టివిటీ (ఎఫ్ఎమ్‌సీ) సైలోస్, రైల్వే లోడింగ్ సదుపాయాలు, రోడ్డు రవాణా వ్యవస్థలు భాగంగా ఉన్నాయి. ఈ ఏకీకృత నెట్‌వర్క్.. కార్యకలాపాల నిర్వహణలో సౌలభ్యాన్ని అందిస్తుంది. ఎన్‌టీపీసీ సిపట్ సహా మధ్య భారతంలో అనేక థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు, ప్రధాన వినియోగదారు సంస్థలకు ఎలాంటి అంతరాయాలూ లేకుండా బొగ్గును సరఫరా చేయడానికి ఈ నెట్‌వర్క్ ఉపయోగపడుతోంది. రోజు రోజుకూ పెంచుతున్న ఉత్పత్తిని గని ప్రవేశ మార్గం వద్ద నిల్వలు జమ చేసి ఉంచకుండా, వినియోగదారులకు అధిక పరిమాణాల్లో వెంటనే సరఫరా చేయడం దీంతో సాధ్యపడుతోంది.

సాంకేతిక విజ్ఞానం, ఆధునికీకరణ.. వీటిపై నిరంతరం పెట్టుబడి పెడుతుండటం దిప్కా అసాధారణ ఉత్పత్తి ప్రస్థానానికి చోదక శక్తిగా మారింది.

ఈ గనిలో రాళ్ళని, మట్టిని ఎత్తడానికి ఉపయోగించే విద్యుచ్ఛక్తి ఆధారిత (42 ఘనపు మీటర్ల) తవ్వకం యంత్రాలు, రంధ్రాలు చేయడంతోనో, పేలుళ్ల పద్ధతిలోనో కాకుండా నేలను, రాళ్లను నేరుగా కత్తిరించే అధిక సామర్థ్యం కలిగిన పెద్ద యంత్రాలు, గనుల గుంటలో ఉపయోగించే సుదీర్ఘ కన్వేయర్ బెల్ట్ వ్యవస్థ, అధునాతన సైలో లోడింగ్ సదుపాయాలతో పాటు గని పర్యవేక్షణకు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. గని నిర్వహణ కోసం డిజిటల్ వేదికలను ఏర్పాటు చేశారు. ఈ సాంకేతికతలు.. పరికరాల ఉత్పాదకతను గణనీయంగా మెరుగుపరిచాయి; గని నియంత్రణను సులభతరం చేశాయి; కార్యకలాపాల్లో జాప్యాన్ని తగ్గించాయి; మొత్తంమీద గని తవ్వకానికి సంబంధించిన కార్యకలాపాల పర్యవేక్షణను బలోపేతం చేశాయి. ఉత్పత్తి రాశి అంతకంతకూ పెరుగుతుండగా, దాంతోపాటే ఉన్నత నిర్వహణ సామర్థ్యం కలిగిందిగా దిప్కాను తీర్చిదిద్దడంలో సాంకేతికత ఒక ముఖ్య కారకంగా మారింది.

అధికోత్పత్తి, పర్యావరణ సంరక్షణ చెట్టపట్టాల్ వేసుకొని ముందుకు సాగ గలుగుతాయని దిప్కా తెలియజెప్పింది.

ఈ ప్రాంతంలో అనేక కార్యక్రమాలను అమలుచేశారు. వాటిలో.. కంటిన్యువస్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్స్ (సీఏఏక్యూఎమ్ఎస్), గనుల్లో గాలిలో తేలియాడే ధూళికణాలను తగ్గించడానికి పెద్ద ఫిరంగుల లాంటి యంత్రాల ద్వారా నీటి తుంపరలను గాలిలోకి చిమ్మే ఫాగ్ కానన్ వ్యవస్థలు, గనుల నుంచి బయటకు వచ్చే భారీ వాహనాల టైర్లు సహా ఆ వాహనాల అడుగు భాగాన్ని శుభ్రం చేసే ప్రత్యేక వ్యవస్థలు, గనుల తవ్వకం వల్ల దెబ్బతిన్న పర్యావరణాన్ని కాపాడటానికి పెద్ద ఎత్తున మొక్కల పెంపకం కార్యక్రమాలను చేపట్టడం, విద్యుత్తు ఆధారిత వాహనాల వినియోగం, ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించడానికి అనువుగా మార్చే కేంద్రాలు వంటివి భాగంగా ఉన్నాయి. ఈ చర్యలతో పర్యావరణ సంరక్షణను బలోపేతం చేశారు. అలాగే గని తవ్వకం కార్యకలాపాలకు సంబంధించినంతవరకు సమగ్ర స్థిరత్వాన్ని మెరుగుపరిచారు. ఏకీకృత ఆన్‌లైన్ వేదికలను ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ పర్యవేక్షణను డిజిటల్ విధానంలో చేపట్టడంతో నియమపాలన, కార్యకలాపాల నిర్వహణలో పారదర్శకత్వం పెరిగాయి.

వీటితో పాటు వ్యవస్థిత పునరావాసం, పునరాశ్రయ కల్పన దిశగా ఆధునిక మౌలిక సదుపాయాల నిర్మాణం.. ఇవి ప్రాజెక్టుతో ప్రభావితమైన కుటుంబాలతో చక్కని అనుబంధాన్ని కొనసాగిస్తూ, రాబోయే కాలంలో గని తవ్వకం కార్యకలాపాల కోసం అవసరమైన భూమి అందుబాటులోకి వచ్చేందుకు తోడ్పడుతున్నాయి. ఈ సమతౌల్య వైఖరి ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక ఉత్పత్తి కి సంబంధించిన దృష్టికోణాన్ని గణనీయంగా పటిష్ఠపరిచింది.

ఇటీవల పర్యావరణ ఆమోదాన్ని 40 ఎమ్‌టీపీఏకు పెంచడం దిప్కా గని సాధించిన విజయాలకు అంతం కాదు, అభివృద్ధి ప్రస్థానంలో ఈ గని తన తదుపరి దశను మొదలుపెడుతోందనడానికి ఆరంభం. భూ సేకరణలో ప్రగతి, పునరావాస కార్యక్రమాల కొనసాగింపు, మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకొంటూ ఉండటం, 60 ఎమ్‌టీపీఏ స్థాయికి విస్తరించాలన్న స్పష్టమైన ప్రణాళికతో పాటు గని తవ్వకం కార్యకలాపాల్లో నిరంతరం ఉన్నత స్థాయి పనితీరును కనబరచడానికి అవసరమైన అన్ని అంశాలూ దిప్కా గని విషయంలో అనుకూలంగా ఉన్నాయి.

గని తవ్వకం సంబంధిత ప్రణాళికలను శాస్త్రీయ దృక్పథంతో రూపొందించడం, సాంకేతికత పరంగా నూతన ఆవిష్కరణలకు మొగ్గు చూపడం, ఆర్థిక విషయాల్లో క్రమశిక్షణను పాటించడం, గని తవ్వకం కార్యకలాపాలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తుండటం.. ఇవన్నీ కలిసి ప్రపంచ స్థాయి గని నిర్వహణకు దోహదపడతాయనడానికి దిప్కా ప్రస్థానమే శక్తిమంతమైన ఉదాహరణ. కోల్ ఇండియా ప్రధాన ఉత్పాదక గనులలో ఒకటైన దిప్కా.. ఉత్పత్తి, లాభదాయకత, కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యం, పర్యావరణ సంబంధ విషయాల్లో జవాబుదారీతనం వంటి అంశాల్లో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూనే ఉంటుంది. దీంతోపాటు, భారత్ ఇంధన భద్రతకు తన వంతు తోడ్పాటును నిలకడగా అందిస్తూనే ఉంటుంది.

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తతే ఆయుధం

## అవగాహన పెంచుకుంటేనే మోసాలకు చెక్ : పోలీస్ కమిషనర్ సునీల్ దత్




ఖమ్మం, ఆగష్టు 6: సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటంతో పాటు అవగాహన పెంచుకోవడం అత్యంత అవసరమని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన 'సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ' అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

డిజిటల్ యుగంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, సోషల్ మీడియా వినియోగం పెరగడంతో సైబర్ నేరాలకు అవకాశాలు కూడా విస్తరించాయని ఆయన తెలిపారు. ప్రజల డబ్బు, వ్యక్తిగత సమాచారం, గోప్యతను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు.

బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ నంబర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తెలియని లింక్‌లపై క్లిక్ చేయకూడదని, ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలని, రెండు దశల భద్రత (టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్) తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. బ్యాంకు లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకే సంప్రదించాలని సూచించారు.

### డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త మోసాలు

కృత్రిమ మేధస్సు (ఏఐ), నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, ఉద్యోగాలు, పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు ఇటీవల వేగంగా పెరిగాయని సునీల్ దత్ తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసుల పేర్లు చెప్పి వీడియో కాల్స్ ద్వారా భయపెట్టి లక్షల రూపాయలు దోచుకుంటున్న ఘటనలు నమోదవుతున్నాయని చెప్పారు.

### వందల ఫిర్యాదులు.. లక్షల్లో నష్టం

ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాల ఫిర్యాదులు నమోదవుతున్నాయని, అత్యంత చదువుకున్నవారు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోతున్నారని పేర్కొన్నారు. ఒకసారి బ్యాంకు వివరాలు లేదా ఓటీపీ నేరగాళ్ల చేతికి చేరితే కొద్ది నిమిషాల్లోనే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసం లేదా ఆర్థిక సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ హెల్ప్‌లైన్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, ఎస్సైలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార ఆధారిత సేంద్రీయ వ్యవసాయం

న్యూఢిల్లీ, ఆగష్టు 6:కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ 2015?16 నుంచి అస్సాంతో సహా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేస్తున్న పరంపరాగత్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) ద్వారా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. అదే ఏడాది నుంచి అస్సాంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో అమలవుతున్న మిషన్ ఆర్గానిక్ వాల్యూ చెయిన్ డెవలప్‌మెంట్ ఫర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ (ఎంవోవీసీడీఎన్ఈఆర్) ద్వారా కూడా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది.

దిగుబడి నుంచి శుద్ధి వరకు, ధ్రువీకరణ నుంచి మార్కెటింగ్ వరకు సేంద్రీయ వ్యవసాయంలో నిమగ్నమైన రైతులకు పూర్తిస్థాయి మద్దతును అందించడంపై రెండు పథకాలు దృష్టి సారిస్తాయి. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యమిస్తూ, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేసేలా ఆర్గానిక్ క్లస్టర్లను ఏర్పాటు చేయడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యం. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రభుత్వాల ద్వారా ఈ రెండు పథకాలు అమలవుతున్నాయి. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పీకేవీవై ద్వారా హెక్టారుకు రూ.31,500 చొప్పున ఆర్థిక సాయం మూడేళ్ల కాలవ్యవధిలో అందుతుంది. దీనిలో పొలంలో/పొలం వెలుపల సేంద్రీయ ఉత్పాదకాల కోసం హెక్టారుకు రూ.15,000 చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రైతులకు నేరుగా అందుతుంది.

రైతు ఉత్పాదక సంస్థల ఏర్పాటు, సేంద్రీయ ఉత్పాదకాల విషయంలో రైతులకు తోడ్పాటు, మొదలైన వాటి కోసం ఎంవోవీసీడీఎన్ఈఆర్ ద్వారా మూడేళ్ల కాలవ్యవధిలో హెక్టారుకు రూ.46,500 చొప్పున సాయం లభిస్తుంది. ఇందులో భాగంగా పొలంలో/ పొలం వెలుపల సేంద్రీయ ఉత్పాదకాల కోసం హెక్టారుకు రూ.32,500 చొప్పున సాయం అందుతుంది. ఈ మొత్తంలో రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా అందించే రూ.15,000 కూడా ఉంటాయి.

ఈ సమాచారాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంగా అందించారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన



నిజామాబాద్, ఆగష్టు 6: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం పిప్రి (జె) గ్రామ ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం గ్రామ ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ప్రజాప్రతినిధులు ఆహారం నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

విద్యార్థులకు ఉదయం రాగి జావ, మధ్యాహ్నం జీరా రైస్, వెజిటేబుల్ బిర్యానీ, చారుతో కూడిన భోజనం అందించినట్లు తెలిపారు.

గ్రామ సర్పంచ్ అరిగెల జనార్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పతాని రంజిత్ అలియాస్ జేమ్స్, వీడీసీ సభ్యులు పల్లె శ్రీనివాస్, స్వామి, రాజు, గంగారం, గ్రామ కార్యదర్శి జితేందర్, కారోబార్ ముత్తన్న తదితరులు పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

# సీ-డీఏసీ, భారత భూగర్భ సర్వే సంస్థల విస్తృత అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, ఆగష్టు 6:నవతరం సాంకేతికతల సాయంతో భూ విజ్ఞానశాస్త్రం, ఖనిజాన్వేషణ, విపత్తుల వేళ తీసుకోదగిన సహాయక చర్యలకు సంబంధించిన సహకారాన్ని బలోపేతం చేయడానికి ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వశాఖ (ఎమ్ఈఐటీవై)కు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డీఏసీ), భారత భూగర్భ సర్వే సంస్థ (జీఎస్ఐ) ఒక విస్తృత అవగాహన ఒప్పందాన్ని (ఎమ్ఓయూ) కుదుర్చుకున్నాయి.

ఎమ్ఈఐటీవై కార్యదర్శి శ్రీ ఎస్.కృష్ణన్ సమక్షంలో సీ-డీఏసీ డైరెక్టర్ జనరల్ శ్రీ ఎమ్. మాగేశ్, భారత భూగర్భ సర్వే సంస్థ (జీఎస్ఐ) అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రదీప్ సింగ్ న్యూఢిల్లీలోని ఎలక్ట్రానిక్స్ సదన్‌లో ఎమ్ఓయూపై సంతకాలు చేశారు.

సీ-డీఏసీకి చెందిన ఉన్నత స్థాయి కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) సామర్థ్యాల్నీ, జీఎస్ఐకి చెందిన భూగర్భ ప్రావీణ్యాన్నీ మేళవించి, ఉన్నత డిజిటల్ సాంకేతికతలతో నేల అడుగున అన్వేషణను చేపట్టడంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించాలన్నదే ఈ ఒప్పంద లక్ష్యం. ఈ భాగస్వామ్యంలో పెద్ద భూభౌతిక డేటాసెట్లను ప్రాసెస్ చేయడానికి కృత్రిమ మేధ (ఏఐ)నీ, హెచ్‌పీసీనీ ఉపయోగిస్తారు. దీనితో.. అధిక స్పష్టత కలిగిన 3డీ సబ్‌సర్ఫేస్ మ్యాపింగ్, ఖనిజ నిక్షేపాలను గుర్తించడానికి ముందస్తు అంచనాలతో కూడిన మోడళ్ల రూపకల్పన, దశాబ్దాల నాటి పాత అసంఘటిత భూవైజ్ఞానిక రికార్డులను ఒక డొమైన్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎమ్)గా ఆవిష్కరించడానికి మార్గం సుగమం అవుతుంది.

కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలను సింథెటిక్ అపెర్చర్ రాడార్ (ఎస్ఏఆర్) ను ఉపయోగించి పర్యవేక్షిస్తుండటం, ప్రాథమిక హెచ్చరిక వ్యవస్థలను రూపొందించడం, హిమానీనద సరస్సుల విస్ఫోటం వల్ల అకస్మాత్తుగా విరుచుకుపడే వరదలకు (గ్లేసియర్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్స్.. జీఎల్ఓఎఫ్) సంబంధించిన అధ్యయనాల్ని చేపట్టడం ద్వారా విపత్తుకు సంబంధించిన నష్టాల తీవ్రతను తగ్గించడానికి ఈ సహకారం తోడ్పడనుంది. దీనికి అదనంగా కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్ఈఈ)ని కనుగొనే ప్రక్రియను వేగవంతం చేయడం కూడా ఈ ఒప్పందం మరో ఉద్దేశం. ఈ కార్యక్రమంతో భారత్‌కు ఆర్థిక భద్రత, సరఫరా వ్యవస్థ దృఢతరం కావడంతో పాటు సాంకేతిక స్వావలంబనలో తోడ్పాటు లభిస్తుంది.

ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న వారిలో ఎమ్ఈఐటీవై సంయుక్త కార్యదర్శి శ్రీ సుదీప్ శ్రీవాస్తవ, డీజీసీఓ, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ మనీశ్ ఖార్, డీజీసీఓ, జీఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రవీర్ పంకజ్, డీజీసీఓ, జీఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ ముకేశ్ వర్మ, ఎమ్ఈఐటీవై గ్రూప్ కోఆర్డినేటర్ (ఐటీ ఆర్ అండ్ డీ) శ్రీ మనోజ్ జైన్, సీ-డీఏసీ (కార్పొరేట్, ప్రభుత్వ వాణిజ్యం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమొడోర్ సందీప్ వాధ్వా, సీ-డీఏసీ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. ఎ.ఎన్. మూర్తి, సీ-డీఏసీ కోల్‌కతా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మృణ్మయ్ కుమార్ దాన్, సీ-డీఏసీ పుణేకు చెందిన సైంటిస్టు 'ఎఫ్' శ్రీ ప్రసాద్ వడ్లాకొండావర్,

సీ-డీఏసీ పుణే కు చెందిన సైంటిస్ట్ 'జీ', విభాగ అధిపతి డాక్టర్ మనోజ్ ఖరే, సీ-డీఏసీ చెన్నైకి చెందిన సైంటిస్ట్ 'ఎఫ్', కేంద్ర అధిపతి డాక్టర్ డి. ఎతిరాజన్, సీ-డీఏసీ చెన్నైకి చెందిన సైంటిస్ట్ 'ఎఫ్' శ్రీమతి పూంగుళలి. పి, సీ-డీఏసీ చెన్నైకి చెందిన సైంటిస్ట్ 'ఈ' శ్రీమతి సాయంతనీ భట్టాచార్య, సైంటిస్ట్ 'సి' శ్రీమతి గీతా సింగ్‌తో పాటు సీ-డీఏసీ, ఎమ్ఈఐటీవైల ప్రతినిధులు ఉన్నారు.

# కేంద్ర విధానాలకు నిరసనగా సీపీఐ పాదయాత్ర




నిజామాబాద్, ఆగష్టు 6:కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఎన్నికల హామీలను విస్మరించిందని సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కూ ప్రవీణ్ విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వం అమలు చేయని హామీలు, ప్రజా సమస్యలపై కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చంద్రమౌళి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతంపేటలో భూ రీ-సర్వేను పరిశీలించిన ఆర్డీవో

నల్గొండ, ఆగష్టు 6: నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలంలోని అంతంపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను చండూరు ఆర్డీవో శ్రీదేవి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భూ రికార్డులు మరింత పారదర్శకంగా, ఆధునికంగా మారుతాయని తెలిపారు.

రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అవసరమైన రికార్డులను సర్వే అధికారులకు అందజేసి రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ రాములు, ఆర్ఐ చిరంజీవి, సర్వేయర్ జైహింద్, జీపీఓ అధికారులు రామస్వామి, అవంతి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక జయశంకర్

## ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు




మహబూబ్‌నగర్, ఆగష్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని అచ్చంపేట తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు.

తహశీల్దార్ సైదులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన సిద్ధాంతపరమైన మార్గనిర్దేశం చిరస్మరణీయమని అన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ఆయన ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ భీష్వ, ఎన్నికల నాయబ్ తహశీల్దార్ పట్టాభి, మండల గిర్దావర్ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, గ్రామ పాలన అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ఆచార్య జయశంకర్ సేవలను స్మరించుకున్నారు.

# మెదక్ అభివృద్ధికి ఎమ్మెల్యే రోహిత్ ప్రత్యేక చొరవ

## రూ.1.6 కోట్లతో 13వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



మెదక్, ఆగష్టు 6:మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పేర్కొన్నారు.

గురువారం మెదక్ పట్టణంలోని 13వ వార్డులో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వారు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ప్రకటనలకు పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించే మార్పుగా ఉండాలని అన్నారు.పట్టణంలోని ప్రతి వార్డుకు పార్టీలకు అతీతంగా సమాన ప్రాధాన్యం కల్పిస్తూ, నాణ్యమైన రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

13వ వార్డు ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో మెదక్ పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చెదల్ సంధ్య నవీన్ కుమార్, అస్తరుగల్ల బాలరాజ్, రాజశేఖర్, అరుణ, సిద్ధిరాములు, కో-ఆప్షన్ సభ్యురాలు అనూష, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా కవి గద్దర్‌కు ఘన నివాళులు

## వర్ధంతి సందర్భంగా స్మరణ సభ నిర్వహించిన ఏఐవైఎస్ నాయకులు

ఆదిలాబాద్, ఆగష్టు 6:ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రజా కవి గద్దర్ వర్ధంతి సందర్భంగా గురువారం చిట్యాల మండల కేంద్రంలో ఏఐవైఎస్ మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమానికి హాజరైన ఏఐవైఎస్ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ, తన పాటనే ఆయుధంగా మలుచుకుని పీడిత వర్గాల గొంతుకగా నిలిచి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని కొనియాడారు.

తన ఆట, పాటల ద్వారా సమాజంలో చైతన్యం నింపి, చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన పోరాట యోధుడిగా గద్దర్ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. భావితరాలకు ఉద్యమ స్ఫూర్తిని అందించిన మహనీయుడిగా ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎస్ మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్, మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, మండల నాయకులు గురుకుంట్ల కిరణ్, గుర్రపు తిరుపతి, పాముకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలు చిరస్మరణీయం.. పిట్లం తహసీల్దార్ మహేందర్



కామారెడ్డి, ఆగష్టు 6:(నేటి నిజం ప్రతినిధి) ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలు చిరస్మరణీయమని పిట్లం తహసీల్దార్ మహేందర్ అన్నారు. పిట్లం తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మహేందర్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మేధోబలాన్ని అందించిన మహనీయుడు అని కొనియాడారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా చాటి చెప్పి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. నిరాడంబర జీవనం, నిజాయితీ, నిబద్ధతతో సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

# కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో పరారీ నేరస్థులను ఎదుర్కోడానికి

# సమగ్ర, నిఘా, సాంకేతికత ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేసిన భారత్

న్యూఢిల్లీ, ఆగష్టు 6:విదేశాలకు పారిపోయిన నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో 2021 నుంచి 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు తిరిగి తీసుకువచ్చారు. నేరస్థులకు తగిన శిక్ష పడేలా చూసేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2018లో 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టాన్ని' తీసుకువచ్చారు. హోం మంత్రి శ్రీ అమిత్ షా దిశానిర్దేశంలో పరారీ నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు, నేరస్థులను స్వదేశానికి రప్పించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు సాంకేతికత, ఇంటెలిజెన్స్ ఆధారిత సమగ్ర వ్యవస్థను భారత్ అభివృద్ధి చేసింది.

2014కు ముందు దేశంలో నేరస్థుల అప్పగింత వ్యవస్థ చాలా పాతబడిపోయి బలహీనంగా ఉండేది. ఆ సమయంలో భారత్‌కు కేవలం 37 దేశాలతో మాత్రమే అప్పగింత ఒప్పందాలు ఉండేవి. ఆర్థిక నేరస్థులను శిక్షించడానికి లేదా వారి ఆస్తులను జప్తు చేయడానికి ఎటువంటి ప్రత్యేక చట్టాలూ లేవు. 2004 నుంచి 2013 మధ్య కాలంలో ఏడాదికి సగటున కేవలం నలుగురు నేరస్థులను మాత్రమే భారత్‌కు తీసుకురాగలిగారు. అంతేకాకుండా 110 అప్పగింత విజ్ఞప్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. దీనికి తోడు అసంపూర్ణమైన పత్రాలు, నెమ్మదిగా సాగే ప్రక్రియ అప్పగింత వ్యవస్థను క్లిష్టతరం చేశాయి. దీనివల్ల తరచూ విదేశీ కోర్టులు భారత్ అభ్యర్థనలను తోసిపుచ్చేవి. డబుల్ జియోపర్డీ (ఒకే నేరానికి రెండుసార్లు శిక్షించకపోవడం), డ్యూయల్ క్రిమినాలిటీ (రెండు దేశాల్లోనూ నేరంగా పరిగణించే చర్య) వంటి న్యాయపరమైన అడ్డంకులు కూడా ఈ ప్రక్రియను ఆలస్యం చేసేవి. హోం మంత్రిత్వ శాఖ, ఇతర విభాగాల మధ్య సరైన సమన్వయం, ఏకీకృత వ్యూహం లేకపోవడం వల్ల పరారీలో ఉన్నవారిపై సమాచారాన్ని పంచుకోవడం, వారి ఆచూకీని గుర్తించడం, రెడ్ కార్నర్ నోటీసులను జారీ చేయడం వంటివి కూడా నెమ్మదిగా సాగాయి.

విదేశాలకు పారిపోయిన నేరస్థులను స్వదేశానికి రప్పించే అంశంలో గత ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పం లోపించిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం పరారీ నేరస్థుల అప్పగింతను ఒక 'జాతీయ ప్రాధాన్యత'గా మార్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా పరారీ నేరస్థులపై మూడు సూత్రాల వ్యూహాన్ని (ప్రపంచవ్యాప్త ఆపరేషన్లు, బలమైన సమన్వయం, చురుకైన దౌత్యం) అమలు చేస్తున్నారు. పరారీ నేరస్థుల అంశం దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వం, శాంతిభద్రతలు, జాతీయ భద్రతలతో ప్రత్యక్షంగా ముడిపడి ఉందని హోం మంత్రి శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు.

మోదీ ప్రభుత్వం 2019లో ఎన్ఐఏ (సవరణ) చట్టం, యూఏపీఏ (సవరణ) చట్టాలను తీసుకువచ్చింది. దీని ఆధారంగా 2020 నుంచి పరారీ నేరస్థులను భారత్‌కు తీసుకువచ్చే ప్రక్రియను మిషన్ మోడ్‌లో చేపట్టారు. దీని ఫలితంగా చట్టపరమైన చర్యలు కేవలం నిషేధిత సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా తీవ్రరూపం దాల్చాయి. విదేశాల్లో తిష్టవేసిన వ్యక్తిగత ఉగ్రవాదులు, వారిని నడిపించే హ్యాండ్లర్లు, నిధులను అందించే వ్యవస్థలు, సహాయక వ్యవస్థలను కూడా ఈ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో పరారీలో ఉన్నవారిని పట్టుకోవడం, వారి వ్యవస్థలను నిర్మూలించడంలో భారత్ సామర్థ్యం గణనీయంగా పెరిగింది.

పరారీ నేరస్థులకు సంబంధించి ప్రత్యేక నిబంధనలను చేర్చుతూ మోదీ ప్రభుత్వం 2024లో మూడు కొత్త క్రిమినల్ చట్టాలను అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) లోని సెక్షన్లు 355, 356 ద్వారా తొలిసారిగా నిందితుడు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానానికి అవకాశం కల్పించారు. దీనివల్ల పారిపోయిన నిందితుడు కోర్టుకు హాజరుకాకపోయినా, అతనికి వ్యతిరేకంగా విచారణ నుంచి శిక్ష ఖరారు వరకు ఉన్న సమగ్ర న్యాయ ప్రక్రియను పూర్తి చేయడానికి వీలవుతుంది.

2022లో 90వ ఇంటర్‌పోల్ జనరల్ అసెంబ్లీకి భారత్ ఆతిథ్యమిచ్చింది. సమాచార మార్పిడి, భాగస్వామ్యం, సహకారం... అంతర్జాతీయ పోలీసు వ్యవస్థకు ఈ మూడు అంశాలనూ కీలకమైన ప్రాతిపదికలుగా కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఆ సందర్భంగా స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే అంతర్జాతీయ సంస్థలతో భారత్‌కు సమన్వయాన్ని, అనుసంధానాన్ని, సమాచార భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా.. 2025 జనవరిలో భారత్‌పోల్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించారు. సీబీఐ, రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయాలు (ఇంటర్‌పోల్ లైజన్ అధికారులు - ఐఎల్‌ఓల ద్వారా), జిల్లా పోలీసు కార్యాలయాలను ఒకే వేదికపైకి తేవడం ద్వారా.. ఒక సమగ్ర సమాచార వ్యవస్థ భారత్‌పోల్ ఏర్పరచింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర, కేంద్ర సంస్థలకు చెందిన 1,400కు పైగా యూనిట్లను ఒకే పోర్టలుకు అనుసంధానించడం వల్ల సమాచార మార్పిడి సులభతరమైంది. ఫలితంగా సీబీఐ, చట్టాన్ని అమలు చేసే ఇతర సంస్థల మధ్య సమాచార వినిమయానికి పట్టే సమయం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం సీబీఐ కోరిన సమాచారాన్ని ఇతర సంస్థలు 10 నుంచి 20 రోజుల్లోనే, కొన్ని సందర్భాల్లో 3 నుంచి 10 రోజుల్లోనే అందిస్తున్నాయి. ఇది దర్యాప్తులో సామర్థ్యాన్ని, నిందితుల అప్పగింత చర్యలనూ వేగవంతం చేసింది. ఈ దిశగా కేంద్ర హోంమంత్రి ఇప్పటివరకు 5 కీలక సమావేశాలను నిర్వహించారు.

మోదీ ప్రభుత్వం మనీ లాండరింగ్ నిరోధక చట్టాన్ని (పీఎమ్ఎల్ఏ) మరింత కఠినంగా అమలు చేస్తోంది. పీఎమ్ఎల్ఏ నిబంధనలను పక్కాగా అమలు చేయడం ద్వారా... 2019 నుంచి 2026 మధ్య కాలంలో పరారీలో ఉన్న నేరస్తులకు చెందిన రూ. 17,874 కోట్లకు పైగా ఆస్తులను ప్రభుత్వం అటాచ్ చేసింది. పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీ కనిపెట్టి, వారిని పట్టుకునే అంతర్జాతీయ ప్రయత్నాలను మరింత బలోపేతం చేయడం కోసం ఒక 'ప్రత్యేక అంతర్జాతీయ వ్యవహారాల కేంద్రా'న్ని సీబీఐ ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ఇంటర్‌పోల్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పోలీసు ఏజెన్సీలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ.. నేరస్తుల గుర్తింపును, అరెస్టులను వేగవంతం చేస్తోంది. సమాచార మార్పిడిని మరింత సులభతరం చేయడం కోసం ప్రతి రాష్ట్రంలోనూ, అన్ని కేంద్ర విచారణ సంస్థల్లోనూ 'ఇంటర్‌పోల్ కాంటాక్ట్ అధికారుల'ను కూడా సీబీఐ నియమించింది. ఇది పరారీలో ఉన్న నేరస్తులకు సంబంధించి.. దర్యాప్తులో సమన్వయాన్ని, అంతర్జాతీయ సహకారాన్ని గణనీయంగా మెరుగుపరిచింది.

ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసుల జారీ ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది. 2022లో 40, 2023లో 100, 2024లో 107, 2025లో 112 నోటీసులు జారీ కాగా? 2026లో ఇప్పటివరకు 182 నోటీసులు జారీ అయ్యాయి. పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీ కనిపెట్టే ప్రయత్నాలను పటిష్టం చేయడం లక్ష్యంగా 'ఆపరేషన్ త్రిశూల్'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద శాటిలైట్ సమాచారం, నిఘా, డిజిటల్ ఆధారాల విశ్లేషణ ద్వారా.. ఇంటర్‌పోల్ సహకారంతో పరారీలో ఉండి దాక్కున్న నేరస్తుల స్థానాలను కచ్చితంగా గుర్తించారు. విదేశాల్లో తలదాచుకున్న చాలా మంది నేరస్తులు తమ పేర్లను, గుర్తింపులను మార్చుకున్నప్పటికీ.. సరికొత్త సాంకేతికత, ప్రొఫైల్ మ్యాపింగ్ ద్వారా భారతీయ విచారణ సంస్థలు వారిని గుర్తించి ఆచూకీ తీశాయి. కోర్టు విచారణలకు వీడియో కాన్ఫరెన్సుల వంటి సాంకేతికతను వినియోగిస్తూ.. నిందితుల అప్పగింత ప్రక్రియను, చట్టపరమైన చర్యలను మరింత వేగవంతం చేశారు. గత మూడేళ్లలో పరారీలో ఉన్న 401 మంది నేరస్తులపై రెడ్ కార్నర్ నోటీసులను జారీ చేశారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గనిర్దేశంలో... ప్రస్తుతం నేరస్తుల అప్పగింత విజ్ఞప్తులను మరింత పక్కాగా, ప్రామాణిక పద్ధతిలో సిద్ధం చేస్తున్నారు. దీనికితోడు.. అభ్యర్థనలు చేసే దేశాల చట్టపరమైన నిబంధనలు, వివిధ పత్రాల ఆవశ్యకతను కూలంకషంగా పరిశీలించి లిఖితపూర్వక హామీలను ఇస్తున్నారు. భారత్‌కు తిరిగి రప్పించిన వారిలో ఉగ్రవాదం, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరాలు, మాదకద్రవ్యాల విక్రయదారులతోపాటు.. హత్యలు, అత్యాచారాలు, పోక్సో చట్టం కింద నేరాలకు పాల్పడి పరారైన నిందితులు ఉన్నారు.

విదేశాల్లో దాక్కున్న నేరస్తులను భారత్‌కు తిరిగి రప్పించే కార్యక్రమాన్ని.. ఉగ్రవాదం, ఖలిస్థాన్ మద్దతుదారుల తీవ్రవాదం, గ్యాంగ్‌స్టర్లు - ఉగ్రవాద సంబంధాలు, మత్తుపదార్థాల అక్రమ రవాణా, సైబర్ మోసాలు, నకిలీ కరెన్సీ వంటి కేసులకు విస్తరించారు. అమెరికా నుంచి తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు రప్పించడం కీలకమైన విజయంగా చెప్పొచ్చు. సంక్లిష్టమైన ఉగ్రవాద కేసుల్లో భారత్ కనబరుస్తున్న పట్టుదలకు, నిరంతర చట్టపరమైన, దౌత్యపరమైన కృషికి ముఖ్యమైన ఉదాహరణ. జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించిన అంశాల్లో.. పరారీలో ఉండి విదేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న వ్యక్తులను ఉగ్రవాదం, మాదకద్రవ్య ఉగ్రవాదం, విదేశాల్లో ఉగ్రవాద మద్దతు వ్యవస్థలను కొనసాగించడానికి ఉపయోగించుకుంటున్నారు.

విదేశాల్లో పరారీలో ఉన్న నేరస్తులను భారత్‌కు తిరిగి రప్పించడంలో సాధించిన విజయం యాదృచ్ఛికం కాదు.. చట్టపరమైన సన్నాహాలు, నిరంతర దౌత్యపరమైన కృషి, క్రమం తప్పకుండా సంప్రదింపులతో భారత్ సాధించిన విశ్వసనీయత ఫలితమిది. ఈ కృషి వెనుక దేశీయంగా ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), సీబీఐ (సీబీఐ), రా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), విదేశాంగ మంత్రిత్వ శాఖ, మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ (ఎన్సీబీ), వస్తు సేవల పన్ను నిఘా డైరెక్టరేట్ జనరల్ (డీజీజీఐ), రాష్ట్ర పోలీసు బలగాల మధ్య ఉన్న బలమైన సమన్వయం ఉంది. పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి రప్పించి, బాధితులకు వేగంగా న్యాయం చేసే దిశగా.. కేంద్ర, రాష్ట్ర సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తున్న నిజమైన 'ఏకోన్ముఖ ప్రభుత్వ' విధానానికి ఇది అద్దం పడుతోంది.

ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరిధిలో పనిచేసే మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎంఏసీ) ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయ బృందాన్ని (స్టాండింగ్ ఫోకస్ గ్రూప్) 2026 జనవరిలో కేంద్రం ఏర్పాటు చేసింది. పరారీలో నేరస్థులను తిరిగి రప్పించే నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా తీసుకున్న కీలక సంస్థాగత చర్యగా ఈ ప్రత్యేక వ్యవస్థను పేర్కొనవచ్చు. ఈ సంస్థ పరారీలో ఉన్న నేరస్తులకు సంబంధించి కేసులను ప్రాధాన్యతా క్రమంలో వర్గీకరించడం, నేరస్తుల సమగ్ర సమాచార పత్రాలను ప్రామాణిక పద్ధతిలో తయారు చేయడం, కేసులకు సంబంధించి సమాచార అంతరాలను తొలగించడం, విదేశీ భాగస్వామ్య సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించడం, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసులకు జాతీయ స్థాయిలో మద్దతు అందించడం ఈ సంస్థ విధులు. విదేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న పరారీలకు సంబంధించిన అంశాలు కేవలం మూలనపడ్డ కేసు ఫైళ్లు మాత్రమే కావు.. అది సజీవంగా కొనసాగుతున్న ముప్పు. దానిని ఎదుర్కోవాలంటే నిరంతర, సమన్వయపూర్వక, ముందస్తు చర్యలు క్రియాశీల చర్యలు అత్యావశ్యకం.

# ప్రజా బాటలో విద్యుత్ సమస్యలపై ఆరా



మహబూబ్‌నగర్, ఆగష్టు 6: ట్రాన్స్‌కో సీఎండీ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న 'ప్రజా బాట - వాక్ అలాంగ్ ది లైన్' కార్యక్రమంలో భాగంగా గురువారం కోడూరు సబ్‌స్టేషన్‌ను సూపరింటెండింగ్ ఇంజినీర్ భీమా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా, నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అక్కడికి వచ్చిన రైతులతో సమావేశమై గ్రామాల వారీగా ఎదురవుతున్న లో వోల్టేజ్, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన ఎస్ఈ భీమా నాయక్, వాటి పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో ఏఈ నర్సిరెడ్డి, డి. సంతోష్ కుమార్, స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# నేరేడుగొమ్ము- కలకొండతండా బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నల్గొండ, ఆగష్టు 6:రూ.2 కోట్ల గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నేరేడుగొమ్ము కలకొండతండా బీటీ రోడ్డు (బ్యాలెన్సింగ్ వర్క్) నిర్మాణానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ముఖ్యంగా రైతులు తమ పంటలను పొలాల నుండి మార్కెట్‌కు వేగంగా తరలించేందుకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని, వ్యవసాయ ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన ప్రజలు ఆసుపత్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ పులికంటి సుధాకర్, మాజీ జడ్పీటీసీ కేతావత్ బాలు నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బైరెడ్డి కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సీనియర్ నాయకుడు యుగేందర్ రెడ్డి, గిరి యాదయ్య, గడ్డం వెంకటయ్య, పరిసర గ్రామాల సర్పంచులు, కొప్పుల సురేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎలిజర్ల శ్రీను, వార్డు మెంబర్లు, రామావత్ మోహన్ పాల్గొన్నారు.

# పుస్తకాలే ఆయన ప్రాణం..పుస్తకాలయాలే ఆయన లోకం...

## దేశంలోనే తొలి గ్రంథాలయ సంఘ స్థాపకులు అయ్యంకి

### ఆగస్టు 7... గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి

పుట్టడం, గిట్టడం సహజం. జీవించినంతలో సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం మానవ ధర్మం. కొంతమంది మాత్రమే తమ జీవితంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసి తమ జీవితాన్నే ఫణంగా పెట్టి మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోతారు . అలాంటి వాటిలో... అయ్యంకి వెంకట రమణయ్య


ముఖ్యులు. గ్రంథాలయోద్యమం అనగానే గుర్తుకు వచ్చే పేరు ఆయనదే. "పుస్తకాలే ప్రాణంగా... పుస్తకాలయాలే లోకం"గా జీవించిన వ్యక్తి. గ్రంథాలయోద్యమ పితా మహుడుగా, జీవితాంతం గ్రంథాలయాల అభివృద్ధి కోసం, అద్వితీయంగా, అనన్యంగా, అహర్నిశలూ, బహుముఖ సేవలందించిన గొప్ప వ్యక్తి అయ్యంకి.

అయ్యంకి వెంకట రమణయ్య (1890-1979) గ్రంథాలయోద్యమ కారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారు. అయన గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితా మహుడుగా పేరు గాంచారు. అయ్యంకి జన్మదినం గురించి రెండు తేదీలు పేర్కొనబడ్డాయి. ఆయన తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండంలో గల కొంకుదురు గ్రామంలో 1890 ఆగస్టు 7న, అలాగే జూలై 24న జన్మించినట్లు పేర్కొనబడింది. తేదీలలో స్వల్ప మార్పులు ఉన్నా, జీ మహనీయుని గురించి నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. అయన తల్లిదండ్రులు వెంకటరత్నం, మంగమాంబ. తండ్రి వెంకతరత్నం గారు నీటిపారుదల శాఖలో ఉద్యోగి.

1907లోప్రముఖ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి లో భారత స్వాతంత్ర్య సమరంలో యువకులు పాల్గొనాలని ఇచ్చిన ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలు విని, చదువుకు స్వస్తి చెప్పి దేశ సేవకు జీవితాన్ని అంకితం చెయ్యటానికి 'రక్షాబంధనం ' కట్టుకొన్నారు.

దేశంలోని పలు సమస్యలకు ముఖ్యకారణం అవిద్య, అజ్ఞానం అని గ్రహించి, అందరినీ విద్యావంతులుగా, జ్ఞాన వంతులుగా చెయ్యాలని అందుకు గ్రంథాలయాల వ్యాప్తి అవసరమని భావించి ఆ ఉద్యమ వ్యాప్తికి కంకణం కట్టుకొన్నారు.

1910 లో బందరులో "ఆంధ్ర సాహిత్య పత్రిక"ను స్థాపించి, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీ రచనలను ప్రచురించి, ప్రజలను చైతన్య వంతం చేశారు. 1914లో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభలను విజయవాడలో నిర్వహించారు. 1919, నవంబరు-14న, చెన్నైలో తొలి "అఖిల భారత పౌర గ్రంథాలయం" ను స్థాపించి, మొదటి మహా సభను నిర్వహించారు. అలాగే 'గ్రంథాలయ సర్వస్వం' (త్రైమాసిక), 'ఇండియన్ లైబ్రరీ జర్నల్', 'కొరడా', 'ప్రకృతి', 'ది ఇండియన్ నేచురోపతి',' 'సహకారం', 'దివ్యజ్ఞాన



దీపిక' వంటి పత్రికలను కూడా నడిపారు. 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డాడు. 1914లో విజయ వాడలో ఆంధ్రదేశ గ్రంథ భాండాగార, ప్రతినిధుల గ్రంథాలయ మహా సభలు జరిపి భారత దేశంలో తొలిసారిగా గ్రంథాలయ సంఘాన్ని, 1915లో సంఘ పక్షాన గ్రంథాలయ సర్వస్వం పత్రికను స్థాపించడానికి తోడ్పడ్డారు. 1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి, 1924లో ఆ సంఘ పక్షాన ఇండియన్ లైబ్రరీ జర్నల్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు.

1934-1948 మధ్యకాలంలో గ్రంథాలయ యాత్రలను అపూర్వమైన స్థాయిలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో కార్యదర్శులు నిర్వహించారు. వీరి మూలంగా వందల సంఖ్యలో కొత్త గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. మూసి వేసినవి పునరుద్ధరించ బడ్డాయి. 1920, 1934లలో గ్రంథాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆంధ్రదేశంలోని ప్రతి గ్రామం పర్యటించారు. అయ్యంకి వెంకట రమణయ్య, దేశంలో పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు గడించారు.

ఆంధ్రభాషాభివర్ధినీ మండలి, ఆంధ్రపరిషత్తు, కళాపీఠము, దివ్యజ్ఞాన చంద్రికామండలి అనే గ్రంథమాలలను స్థాపించి అనేక ఉత్తమ రచనలను తెలుగు పాఠకులకు అందించారు. గ్రంథాలయోద్యమంలో ఆయన సేవలను గుర్తించి, ఆయన సప్తతి మహోత్సవ సందర్భంగా, గుడివాడలో 'సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠావనాచార్య' బిరుదుతో సత్కరించారు.

1919లో అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని స్థాపించిన రోజును భారత గ్రంథాలయ సంస్థ గుర్తించి నేషనల్ లైబ్రరీ డే (జాతీయ గ్రంథాలయ వారోత్సవ దినం)"గా దేశమంతటా 1968 నుంచి ప్రతి సంవత్సరం జాతీయ గ్రంథాలయ1968 నుండి, "జరుపుకొను చున్నారు.

ఆయన అనేక గ్రంథాలయ యాత్రలను నిర్వహించి, "ప్రజా గ్రంథాలయవే ప్రజల విశ్వవిద్యాలయం" అని చాటి చెప్పారు.

భారత ప్రభుత్వం ఆయన గ్రంథాలయ సేవలకు స్పందించి 1972 లో' 'పద్మశ్రీ'తో .గౌరవించింది. గ్రంథాలయ పితామహ, గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ విశారద, సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య, సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు. 1977లో ప్రొఫెసర్ కౌలా అంతర్జాతీయ స్వర్ణపతకం పొందారు.

ఆంధ్రవిశ్వ కళాపరిషత్తు గ్రంథాలయ శాస్త్ర పరీక్షలో ఉత్తమ విద్యార్థికి అయన పేరుతో స్వర్ణ పతకం ఇస్తున్నది. 1979లో అయ్యంకి లైబ్రరీ కమిటీ ఏర్పడి ప్రతి సంవత్సరం ఉత్తమ గ్రంథాలయ కార్యకర్తను సత్కరిస్తోంది. ఆయన తండ్రి వెంకట రత్నం అయ్యంకిలో శ్రీ గంగా పర్వత. వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. వెంకట రమణయ్య 1979, మార్చి 7న మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## శ్రీ రాజరాజేశ్వర కార్పెంటర్ సొసైటీ ఆధ్వర్యంలో జయశంకర్ 92 వ జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో శ్రీ రాజరాజేశ్వర కార్పెంటర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తెలంగాణలో మలి దశ ఉద్యమంలో ప్రత్యేక పాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర చాలా విలువైనదని సొసైటీ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం చారి వేములవాడ రాజేశ్వర సొసైటీ అధ్యక్షుడు దర్శనాల రాములు వేములవాడ రూరల్ మండల అధ్యక్షులు చందనం రవీందర్ చారి కసర్ల కరుణాకర్ సంకోజి రామలింగం దర్శనాల రాజు వేములవాడ వీరచారి శ్రీరాముల రమేష్ కసర్ల రాజేశం సనుగుల రవి చంద్రగిరి నాగరాజు వేములవాడ ఆంజనేయులు యశోద మురళి తదితరులు సంఘం కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో ఘనంగా వనమహోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణను ఆకాంక్షిస్తూ వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ స్పృహ పెంపొందించేలా పట్టణ వీధుల గుండా ప్రదర్శన చేపట్టి, భారీ ర్యాలీ నిర్వహించారు.


"ఈచ్ వన్- ప్లాంట్ వన్ ", "పచ్చని చెట్టు- ప్రగతికి మెట్టు" , "సేవ్ ట్రీస్- సేవ్ లైఫ్ " అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ర్యాలీ అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పలు రకాల నీడనిచ్చే మరియు పూల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా పిల్లలకు వ్యాస రచన పోటీలు మరియు డ్రాయింగ్ కాంపిటీషన్ ను కూడా నిర్వహించారు .పిల్లలు ఇట్టి కార్యక్రమంలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు .

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మరియు దరక్షణ్ వస్ఫియ మాట్లాడుతూ... భావి తరాల భవిష్యత్తు కోసం పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు. చెట్ల పెంపకం ప్రాముఖ్యతను తెలియజేసేందుకే ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ నరాల దేవేందర్ , ప్రిన్సిపాల్ దరక్షణ్ వస్ఫియ, డైరెక్టర్ హసన్ ఫని ఉల్లాహ్,ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ గారికి నివాళులు అర్పించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్,6(నేటినిజం ప్రతినిధి) తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మార్గదర్శకులు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్ గారి ఆలోచనలు, ఉద్యమ స్ఫూర్తి, త్యాగం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే తన జీవిత ధ్యేయంగా భావించి, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడిగా జయశంకర్ గారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి ఆయన అందించిన సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వంగల పవన్, గొట్టిముక్కల వెంకటరమణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీ రామోజు రవీంద్రాచారి, శ్రీమంతుల సదాశ్రీ, తిప్పారపు శ్రీనివాస్, గద్దె జగదీశ్వరాచారి, కట్ట రవీందర్, కనపర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం..

### -బాలల రక్షణే ప్రథమ ప్రాధాన్యత...



కరీంనగర్,6(నేటినిజం ప్రతినిధి) తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శోభారాణి అధ్యక్షతన గురువారం "గ్రామ బాలల పరిరక్షణ కమిటీ" సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమం, భద్రతకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు, కమిటీ సభ్యులకు తగు సూచనలు చేశారు. 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు మెరుగైన రక్షణ, సంరక్షణ సేవలను అందించడం. సెమీ-అర్బన్ ప్రాంతాలు మరియు అనాథ (ఆర్ఫన్) పిల్లల సమగ్ర డాటా సేకరణ చేపట్టడం. బాల్య వివాహాలు జరగకుండా కట్టడి చేయడం., గ్రామంలో బాల కార్మికులు భిక్షాటన చేయించే పిల్లలు ఎవరూ లేకుండా చూడటంతో పాటు, బడి బయట ఉన్న (డ్రాప్-అవుట్) పిల్లలను మళ్లీ బడిలో చేర్పించేలా గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మ, మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రణీత, పల్లె దవాఖాన డాక్టర్ జవేరియా, ప్రధానోపాధ్యాయులు ఉమా, అంగన్వాడీ టీచర్ అరుంధతి, ఆశా కార్యకర్తలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో జయశంకర్ విగ్రహానికి హరీష్‌రావు ఘన నివాళి



సంగారెడ్డి, ఆగష్టు 6: (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ సిద్ధాంతకర్త, రాష్ట్ర ఉద్యమానికి దిక్సూచి అయిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి. హరీష్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జయశంకర్ సేవలను స్మరించుకుంటూ ఆయన తెలంగాణ సమాజానికి అందించిన స్ఫూర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, జయశంకర్ సార్ తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ అనేది కేవలం భౌగోళిక ప్రాంతం కాదని, అది స్వాభిమానం, స్వయం నిర్ణయం, సామాజిక న్యాయం అనే భావజాలమని దేశానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిత్వం జయశంకర్ సార్ అని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు.

జయశంకర్‌కు సిద్దిపేటతో ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేసిన హరీష్‌రావు, సిద్దిపేట అమరవీరుల స్తూపానికి ఆయన చేతుల మీదుగానే శంకుస్థాపన జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమవుతుందని విశ్వసించి, ఉద్యమంలో ఆయనకు జయశంకర్ వెన్నుదన్నుగా నిలిచారని పేర్కొన్నారు.

జయశంకర్ వ్యక్తి కాదని, ఒక శక్తి అని అభివర్ణించిన హరీష్‌రావు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడం ఆయనతో పాటు ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి దీర్ఘకాల పోరాట ఫలితమని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడామని పేర్కొన్నారు.

అనంతరం రాష్ట్రంలో జలవనరుల అంశంపై కూడా హరీష్‌రావు స్పందించారు. తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి జలాల వినియోగం, జీఆర్ఎంబీ పరిధిలోని ప్రాజెక్టుల అనుమతులు, బనకచర్ల ప్రాజెక్టు, సమ్మక్కసాగర్‌కు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ ప్రజల హక్కులు, జలవనరులు, అభివృద్ధి ప్రాజెక్టులను పరిరక్షించడమే జయశంకర్ సార్‌కు నిజమైన నివాళి అవుతుందని హరీష్‌రావు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేర్చడం ప్రతి తెలంగాణవాసి బాధ్యత అని అన్నారు.

## పెన్షనర్ల బకాయిలపై ధర్నాకు పిలుపు

### -పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

కామారెడ్డి, ఆగష్టు 6:(నేటినిజం ప్రతినిధి) పెన్షనర్ల ఆర్థిక బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో పెన్షనర్ల జేఏసీ పిలుపుమేరకు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏటీ) జిల్లా నాయకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు.

గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, గ్రాట్యుటీ, జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్ వంటి చెల్లింపులు ఇప్పటికీ అందలేదని వారు ఆరోపించారు. ఈ ఆలస్యం కారణంగా పలువురు పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు అనారోగ్యానికి గురై అకాల మరణాలు కూడా చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కొత్త వేతన సవరణను అమలు చేయకపోవడంతో పాటు ఆరు డీఏలను పెండింగ్‌లో ఉంచిందని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు భత్యాన్ని కూడా రాష్ట్రం అమలు చేయడం లేదని విమర్శించారు.అలాగే ఆరోగ్య కార్డుల జారీ, గుర్తింపు పొందిన ఆసుపత్రుల జాబితా ఖరారు చేయడంలో కూడా ప్రభుత్వం జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. పెన్షనర్ల నుంచి బేసిక్ పేలో 1.5 శాతం మినహాయిస్తున్నప్పటికీ, తగిన వైద్య సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి, పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతో పాటు అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, నాయకుడు విజయరామరాజు కోరారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.